మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

ఆదివారం SUNDAY 6-9-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 || సంచిక: 69 Issue: 69

06 సెప్టెంబర్ 2026 - ఆదివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు శ్రావణ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:06 సూర్యాస్తమయం - సా. 6:22 తిథి దశమి రా. 7:29 వరకు తరువాత ఏకాదశి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం ఆరుద్ర రా. 7:50 వరకు తరువాత పునర్వసు యోగం సిద్ధి ఉ. 9:39 వరకు కరణం వనిజ ఉ. 8:41 వరకు విష్టి రా. 7:29 వరకు వర్జ్యం తె. 5:19 నుండి ఉ. 6:48 వరకు దుర్ముహూర్తం సా. 4:44 నుండి సా. 5:33 వరకు రాహుకాలం సా. 4:50 నుండి సా. 6:22 వరకు యమగండం మ. 12:14 నుండి మ. 1:46 వరకు గుళికాకాలం మ. 3:18 నుండి సా. 4:50 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:30 నుండి తె. 5:18 వరకు అమృత ఘడియలు ఉ. 10:32 నుండి మ. 12:02 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:49 నుండి మ. 12:39 వరకు గమనిక: "౦" అనగా మరుసటి రోజున

Circulated to Telangana Published from Jagitial


# కేటీఆర్ నిక్కృష్టుడు

## తోడబుట్టిన చెల్లిని మెడ పట్టి గెంటేసిన నీచుడు

## నాలుగు ఇంగ్లిష్ ముక్కలొస్తే గొప్పోనివా?

## నీ చదువు.. నా చదువు సభలో తేల్చుకుందాం

## కేటీఆర్‌పై సీఎం రేవంత్ తీవ్ర వ్యాఖ్యలు



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పెద్దగా చదువు రాదన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. నీ చదువేందో.. నా చదువేందో సభలో తేల్చుకుందాం అని కేటీఆర్‌కు సవాల్ విసిరారు. నకిరేకల్‌లో ఏర్పాటు చేసిన సభలో సీఎం రేవంత్ పాల్గొని ప్రసంగించారు.

నకిరేకల్, సెప్టెంబర్ 5 (ఈవార్తలు): 'రేవంత్‌కు పెద్దగా చదువు రాదని ఎక్కడో అన్నడంట.. నాకు చదువు వస్తదో రాదో కాని రేవంత్ రెడ్డికి సంస్కారం ఉంది. నాకు సంస్కారం ఉంది కాబట్టే.. ఇప్పటికి మిమ్మల్ని తరువాయి 2 వ పేజీలో...



# రేవంత్ పేస్ట్ కారుద్ది

## కేసీఆర్ గుద్దుకు మైండ్ బ్లాంక్ అయితది

## తెలంగాణను ముంచి ముసలి నక్క కాంగ్రెస్

## కరీంనగర్‌లో కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు

సీఎం రేవంత్ రెడ్డి వంద రోజుల పాలన అని చెప్పి వెయ్యి రోజుల పాటు ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఇచ్చిన ఉద్యోగాలపై ఓపెన్ ఛాలెంజ్ విసరడంతో పాటు, మహేష్ బాబు సినిమా డైలాగ్స్ తో రేవంత్ కు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. కరీంనగర్ వేదికగా నిర్వహించిన జెన్ జీ కేటీఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.

కరీంనగర్, సెప్టెంబర్ 5 (ఈవార్తలు): తొమ్మిదిన్న రేళ్ల కేసీఆర్ ప్రభుత్వంలో 2,32,308 ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్లు ఇచ్చి, 1,60,083 ఉద్యోగాలు భర్తీ చేశామని స్పష్టం చేశారు. "నేను చెప్పింది అబద్ధమని దమ్ముంటే రేవంత్ రెడ్డి నిరూపించాలి. నిరూపిస్తే ఇదే కరీంనగర్ గడ్డ మీద రాజీనామా చేసి రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటా" అని కేటీఆర్ సవాల్ విసిరారు. బీఆర్ఎస్ ఇచ్చిన 70 వేల ఉద్యోగాలకు కాంగ్రెస్ నాయకులు అపాయింట్‌మెంట్ లెటర్లు ఇచ్చి క్రెడిట్ చోరీ తరువాయి 2 వ పేజీలో...




# టీచరమ్మే మిస్ వరల్డ్ 2026

## డొమినికన్ బ్యూటీకి ప్రపంచ సుందరి కిరీటం

### భారత్ భామ నికితా పోర్వాల్‌కు టాప్ 20లోనూ దక్కని చోటు

### మలేసియా, స్పెయిన్ సుందరీమణులకు రన్నరప్ స్థానాలు

వియత్నాం వేదికగా అట్టహాసంగా జరిగిన 73వ మిస్ వరల్డ్ 2026 పోటీలు ముగిశాయి. ఈ ప్రతిష్ఠాత్మక కిరీటాన్ని డొమినికన్ రిపబ్లిక్‌కు చెందిన జోహెర్రీ మోలా డొమింగ్వెజ్ గెలుచుకుంది. స్పెయిన్‌కు చెందిన ఎలిసబెత్ రెయిన్స్ మొదటి రన్నరప్‌గా, మలేసియాకు చెందిన తానూసియా చెట్టి రెండో రన్నరప్‌గా నిలిచారు.

హనోయ్: గత ఏడాది విజేత, థాయ్‌లాండ్‌కు చెందిన ఓపల్ సుచాతా చువాంగ్‌శ్రీ ప్రపంచ సుందరికి కిరీటాన్ని డొమింగ్వెజ్‌కు అలంకరించింది. కొత్త ప్రపంచ సుందరి జోహెర్రీ వృత్తిరీత్యా టీచర్, సామాజిక కార్యకర్త. 'వాయిసెస్ ఆఫ్ టుమారో' అనే సంస్థ ద్వారా వెనుకబడిన వర్గాల పిల్లలకు ఇంగ్లిష్ తరువాయి 2 వ పేజీలో...



# పింఛన్లకు ఫీల్డ్ వెరిఫికేషన్

## సర్కారు మార్గదర్శకాలు విడుదల

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (ఈవార్తలు): రాష్ట్రంలో సామాజిక చేయూత పథకం కింద కొత్త పెన్షన్ల మంజూరుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. కొత్త పెన్షన్లకు క్షేత్రస్థాయి పరిశీలన తప్పనిసరి చేసింది. ఇందులో-2 వ పేజీలో...

# ఏఐ డేటా 'భాగ్యం'

## హైదరాబాద్‌లో అతిపెద్ద ఏఐ డేటా సెంటర్

### రూ.70 వేల కోట్ల పెట్టుబడితో 7వేల ఉద్యోగాలు

### టీసీఎస్-హైపర్‌వాల్ట్‌తో రాష్ట్ర ప్రభుత్వ ఒప్పందం

దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ క్యాంపస్ హైదరాబాద్‌లో ఏర్పాటు కానుంది. టీసీఎస్ అనుబంధ నిసంస్థ హైపర్‌వాల్ట్ దీనిని అభివృద్ధి చేయనుంది. ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణకు హైపర్‌వాల్ట్‌తో పాటు భాగస్వామ్య సంస్థలు దాదాపు రూ.70వేల కోట్లు పెట్టుబడి పెట్టనున్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 7వేల ఉద్యోగాలు లభించనున్నాయి. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో హైపర్‌వాల్ట్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.



హైదరాబాద్, సెప్టెంబర్ 5 (ఈవార్తలు): టీసీఎస్ ప్రతినిధుల బృందం సీఎం రేవంత్ రెడ్డితో శనివారం సచివాలయంలో సమావేశమైంది. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు. టీసీఎస్ సీఈఓ కే కృతివాసన్, సీఓఓ ఆర్తి సుబ్రమణియన్, హైపర్‌వాల్ట్ ప్రెసిడెంట్ వీ రాజన్న, సీఈఓ, ఎండీ దీపేష్ నందా హాజరయ్యారు. అమెరికా నుంచి వీడియో తరువాయి 2 వ పేజీలో...




బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,480 |
| వెండి (కిలో): | రూ.2,,54,900 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,513 |




# ఓల్డ్ మాంక్ రమ్ కాదు

## స్పిరిట్‌లో రమ్ ఫ్లేవర్ కలుపుతున్నారు

### బాంబే హైకోర్టుకు ఎఫ్ఎస్ఎస్ఏఐ వెల్లడి

భారతదేశంలో అత్యంత ఆదరణ కలిగిన బ్రాండ్లలో ఒకటైన 'ఓల్డ్ మాంక్'కు సంబంధించి ఒక కీలక విషయం వెలుగులోకి వచ్చింది. ఓల్డ్ మాంక్‌ను 'రమ్'గా విక్రయించరాదని ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) బాంబే హైకోర్టుకు విన్నవించింది.

ముంబై: న్యూట్రల్ స్పిరిట్స్‌లో రమ్ ఫ్లేవర్‌ను జోడించడం ద్వారా ఈ ఉత్పత్తిని తయారు చేస్తున్నారని, వాస్తవ రమ్‌కు ఉండాల్సిన ప్రమాణాలు ఇందులో లేవని ఎఫ్ఎస్ఎస్ఏఐ స్పష్టం చేసింది. ఓల్డ్ మాంక్ తయారీ సంస్థ అయిన మోహన్ రాకీ స్ప్రింగ్‌వాటర్ ప్రైవేట్ లిమిటెడ్, మహారాష్ట్రలో తమ ఉత్పత్తుల విక్రయాలను నిలిపివేస్తూ ఎఫ్ఎస్ఎస్ఏఐ జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ హైకోర్టును తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



ఆస్టియోఆర్థరైటిస్ కేవలం ద వయసు పెరగడం వల్ల, కీళ్లు అరిగిపోవడం రాదని తాజా అధ్యయనం వెల్లడించింది. దీని వెనుక దీర్ఘకాలిక వాపు, కణాల్లో అసాధారణ మార్పులు, మృదులాస్థి (కార్టిలేజ్) క్రమంగా దెబ్బతినడం వంటి క్రియాశీల జీవ ప్రక్రియలు ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. కీళ్లలోని కార్టిలేజ్‌ను సంరక్షించే కొండ్రోసైట్స్ అనే ప్రత్యేక కణాలు ఒత్తిడికి గురైనప్పుడు వాపును కలిగించే పదార్థాలు, కార్టిలేజ్‌ను విచ్ఛిన్నం చేసే ఎంజైమ్‌లను అధికంగా విడుదల చేస్తున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. దీంతో కార్టిలేజ్ పలుచబడి ఎముకలు ఒకదానికొకటి రాపిడికి గురై నొప్పి, బిగుతు, వాపు, కదలికల్లో ఇబ్బందులు ఏర్పడతాయని పేర్కొన్నారు.

# సర్ గడువు పొడిగించండి

## ఈసీఐకి టీజీ సీఈవో లేఖ



హైదరాబాద్, సెప్టెంబర్ 5 (ఈవార్తలు): సర్ గడువును మరోసారి పొడిగించాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌ను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి కోరారు. అభ్యంతరాలు, క్లెయిమ్‌ల గడువు ఈనెల 16తో ముగియనుండగా మరో మూడు వారాలు గడువు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు తరువాయి 2 వ పేజీలో...

# టీచర్ల పేర్ల ముందు 'టీఆర్'

## ప్రిఫిక్స్ చేర్చుతూ కర్ణాటక నిర్ణయం

### టీచర్స్ డే వేళ సరికొత్త కానుక



బెంగళూరు: ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యారంగానికి ఓ చారిత్రాత్మక కానుకను అందించింది కర్ణాటక సర్కారు. సమాజానికి ఉపాధ్యాయులు అందిస్తున్న అమూల్యమైన సేవలను గుర్తించి, వారి గౌరవాన్ని మరింత పెంపొందించే ఉద్దేశంతో ఇకపై పేర్ల ముందు 'టీఆర్' అనే ప్రత్యేక ప్రిఫిక్స్ ఉపయోగించుకునేందుకు అనుమతినిచ్చింది. ఉపాధ్యాయులను గౌరవించే సమాజం తన భావి తరాల తరువాయి 2 వ పేజీలో...




# రాశి ఫలాలు

6.9.2026

మేషం: ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయటం మంచిది కాదు. ముఖ్యమైన పనులు వాయిదా వేయడం మంచిది. వృత్తి వ్యాపారాలలో స్వల్ప అవాంతరాలు తప్పవు. ఉద్యోగాలలో స్థానచలన సూచనలు ఉన్నవి. ఆర్థిక ఇబ్బందుల వలన నూతన ఋణయత్నాలు చేస్తారు. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి.

వృషభం: ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. దూరప్రయాణాలలో మార్గ అవరోధాలు ఉంటాయి. వ్యాపార లావాదేవీలు నిరుత్సాహపరుస్తాయి. ఉద్యోగాలలో పని ఒత్తిడి మరింత పెరుగుతుంది. ముఖ్యమైన పనులు మందకొడిగా సాగుతాయి. అవసరానికి చేతికి ధనం అందక ఇబ్బంది పడతారు. సంతానం విద్య ఉద్యోగ యత్నాలు మందగిస్తాయి.

మిధునం: ప్రముఖులతో పరిచయాలు విస్తృతం అవుతాయి. సోదరులతో ఆస్తి వివాదాలు పరిష్కారమవుతాయి. వ్యాపారాలు ఆశాజనకంగా సాగుతాయి. ఉద్యోగాలలో మీ మాటకు విలువ పెరుగుతుంది. బంధుమిత్రులతో శుభకార్యాలకు హాజరవుతారు. పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. గౌరవ మర్యాదలకు లోటుండదు.

కర్కాటకం: బంధువుల నుంచి శుభవార్తలు అందుతాయి. సన్నిహితులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో చర్చలు సఫలమవుతాయి. వ్యాపార విస్తరణకు కీలక నిర్ణయాలు అమలుపరుస్తారు. చిన్ననాటి మిత్రులతో దైవ క్షేత్రాలు దర్శించుకుంటారు. చేపట్టిన పనుల్లో విజయం సాధిస్తారు.

సింహం: వృత్తి వ్యాపారాలలో భాగస్వాములతో ఒప్పందాలు వాయిదా పడతాయి. ఆర్థిక పరిస్థితి కొంత గందరగోళంగా ఉంటుంది. ఉద్యోగమున ఊహించని సమస్యలు ఎదురవుతాయి. సన్నిహితులతో వివాదాలు చికాకు పరుస్తాయి. చేపట్టిన పనులలో శ్రమ పడ్డా ఫలితం కనిపించదు.

కన్య: వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. పాత ఋణాలు తీర్చడానికి నూతన ఋణాలు చేస్తారు. చేపట్టిన పనులలో తొందరపాటు మంచిది కాదు. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ఉద్యోగ ప్రయత్నాలు నిరుత్సాహ పరుస్తాయి. దూరప్రయాణాల వలన శారీరక శ్రమ అధికమవుతుంది. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

తుల: సంఘంలో పేరు కలిగిన వ్యక్తులతో పరిచయాలు విస్తృతమవుతాయి. సన్నిహితులతో గృహమున ఉత్సాహంగా గడుపుతారు. ఆకస్మిక ధన లాభ సూచనలు ఉన్నవి. వ్యాపార, ఉద్యోగాలలో ప్రోత్సాహకర వాతావరణం ఉంటుంది. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలకు కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు అందుతాయి.

వృశ్చికం: వ్యాపారాలు లాభ సాటిగా సాగుతాయి. మిత్రులతో సభలు, సమావేశాలలో పాల్గొంటారు. ఇంటాబయట సమస్యలు కొంత బాధిస్తాయి. ఉద్యోగాలలో సహోద్యోగులతో వివాదాలు పరిష్కారమౌతాయి. ఋణదాతల నుండి ఒత్తిడులు అధికమౌతాయి. దూరప్రయాణాలు వాయిదా పడతాయి.

ధనస్సు: వృత్తి వ్యాపారాలు పుంజుకుంటాయి. సమాజంలో పరిచయాలు విస్తృతమౌతాయి. సన్నిహితులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. ఉద్యోగాలలో ఒడిదుడుకులు అధిగమించి ముందుకు సాగుతారు. విందు వినోద కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి. చేపట్టిన వ్యవహారాలు సాఫీగా సాగుతాయి.

మకరం: మిత్రులతో అకారణ వివాదాలు కలుగుతాయి. ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించాలి. వ్యయ ప్రయాసలతో కానీ పనులు పూర్తి కావు. మిత్రుల నుంచి ఋణ ఒత్తిడులు అధికమవుతాయి. వ్యాపారాలు ముందుకు సాగక చికాకులు అధికమవుతాయి. ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులు ఉంటాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు.

కుంభం: ఇంటా బయట చిత్రమైన సంఘటనలు చోటుచేసుకుంటాయి . నిరుద్యోగులకు నూతన అవకాశాలు లభిస్తాయి. వ్యాపారాలలో విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు. చేపట్టిన పనులు విజయవంతంగా సాగుతాయి. ఆప్తుల నుంచి అరుదైన ఆహ్వానాలు అందుతాయి.

మీనం: భూ సంబంధిత క్రయ విక్రయాలు లాభసాటిగా సాగుతాయి. నూతన పనులు ప్రారంభిస్తారు. ఆత్మీయుల నుంచి కీలక సమాచారం అందుతుంది. వ్యాపారస్థులకు నూతన పెట్టుబడులు అందుతాయి. విందువినోద కార్యక్రమాలకు హాజరు అవుతారు. ఉద్యోగాలలో మీ నిర్ణయాలను అందరూ గౌరవిస్తారు.




# ఏఐ డేటా 'భాగ్యం'

మొదటి పేజీ తరువాయి

కాన్ఫరెన్స్ ద్వారా ఓపెన్ఏఐ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ఉదయ్ రుద్రరాజు పాల్గొన్నారు. 250 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో గిగావాట్ (1,000 మెగావాట్లు) సామర్థ్యంతో క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నారు. ప్రపంచంలోని అగ్రశ్రేణి ఏఐ కంపెనీలు, హైపర్‌స్కేలర్లు, గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్‌కు అవసరమైన భారీ కంప్యూటింగ్ మౌలిక వసతులను ఇది అందించనుంది. అధిక సామర్థ్యమున్న కంప్యూటింగ్ వ్యవస్థలు, లిక్విడ్ కూలింగ్ వంటి అత్యాధునిక సాంకేతికతను వినియోగించనున్నారు. దేశంలోని అత్యంత అధునాతన, అతిపెద్ద ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ క్యాంపస్‌లలో ఇది ఒకటిగా నిలవనుంది. గ్రీన్ ఎనర్జీ, వాటర్-న్యూట్రల్ డిజైన్‌తో పర్యావరణహితంగా అభివృద్ధి చేయనున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణకే కాకుండా దేశానికి ఇది చారిత్రాత్మక ప్రాజెక్టు అని అన్నారు. ఏఐ విప్లవంలో హైదరాబాద్ ప్రపంచస్థాయిలో అగ్రగామిగా ఎదుగుతోందని అభిప్రాయపడ్డారు. ఏఐ మోడల్స్, కంప్యూటింగ్ సామర్థ్యం భవిష్యత్తులో కీలక ప్రజా మౌలిక వసతులుగా మారనున్న తరుణంలో ఆ సామర్థ్యం తెలంగాణలోనే అందుబాటులో ఉండటం రాష్ట్రానికి గొప్ప ప్రయోజనమని అన్నారు. తెలంగాణలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన టీసీఎస్ ప్రతినిధులను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు. ప్రభుత్వం తరఫున తగిన సహాయ సహకారాలు అందిస్తామని ప్రకటించారు. టీసీఎస్ తీసుకున్న ఈ నిర్ణయంతో తన కల నెరవేరిందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఆశించిన విధంగా ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి బలమైన పునాది పడిందని అన్నారు. తెలంగాణ రైజింగ్ విజన్-2047 ప్రకారం 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని సాధించే దిశగా ఈ ప్రాజెక్టు కీలక ముందడుగు అని అభివర్ణించారు. ఈ భారీ పెట్టుబడితో ఏఐ, డేటా సెంటర్లతో పాటు విద్యుత్, కూలింగ్, నెట్‌వర్కింగ్, నిర్మాణం, ఇంజినీరింగ్, ఆపరేషన్స్ వంటి అనుబంధ రంగాల్లోనూ కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి. ఈ ప్రాజెక్టుపై చర్చలకు 2026 జనవరిలో దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టాటా సన్స్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ మధ్య జరిగిన సమావేశం నాంది పలికింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం, టీసీఎస్ ప్రతినిధులతో పలుమార్లు చర్చలు జరిపి కొద్ది నెలల్లోనే ప్రాజెక్టును కార్యరూపంలోకి తీసుకొచ్చాయి. దేశంలోని మరో ఐదు రాష్ట్రాల నుంచి పోటీ ఉన్నప్పటికీ తెలంగాణ ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును సాధించింది. దీంతో హైదరాబాద్‌ను గ్లోబల్ ఏఐ, డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యం మరింత చేరువైంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రభుత్వ సలహాదారు కె రామకృష్ణారావు, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవో అజిత్‌రెడ్డి, టీజీఐఐసీ ఎండీ కె శశాంక, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణాదిత్య, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ నిఖిల్ చక్రవర్తి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# టీచర్ల పేర్ల ముందు 'టీఆర్'

మొదటి పేజీ తరువాయి

భవిష్యత్తును పదిలపరుచుకుంటుందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. సాధారణంగా వైద్య వృత్తిలో ఉన్నవారు తమ పేర్ల ముందు 'డీఆర్' అని, కళాశాల అధ్యాపకులు 'ప్రొఫెసర్' అని ఎలాగైతే రాసుకుంటారో.. సరిగ్గా అదే తరహాలో ఇకపై పాఠశాల ఉపాధ్యాయులు కూడా తమ పేర్ల ముందు 'టీఆర్' అని సగర్వంగా రాసుకోవచ్చని ప్రభుత్వం తెలిపింది. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఈ నిర్ణయాన్ని పంచుకున్న డీకే.. ఇది రెండు అక్షరాల పదం మాత్రమే కాదని, ఒక మనిషి తన జీవితాంతం సమాజానికి చేసే నిష్కామ సేవకు ప్రతీక అని అభివర్ణించారు. ఇతరుల భవిష్యత్తును దిద్ది తీర్చేందుకు తమ జీవితాలను అంకితం చేసిన గురువులకు సమాజం ఇచ్చే గొప్ప గౌరవం ఇది అని కొనియాడారు. దేశాన్ని నిర్మించే ప్రతీ ఒక్క పౌరుడిని తీర్చిదిద్దే శక్తి ఒక్క ఉపాధ్యాయుడికి మాత్రమే ఉందనే విషయాన్ని ప్రభుత్వం గుర్తుచేసింది. మన దేశంలో కోటి మందికి పైగా ఉపాధ్యాయులు ఉండగా.. ఒక్క కర్ణాటకలోనే దాదాపు 4.5 లక్షల మంది బోధకులు ప్రతిరోజూ పిల్లల మనస్సులను, వారి ప్రవర్తనను, భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నారు. సమాజంలో ప్రాణాలు కాపాడే డాక్టర్ అయినా, వినూత్న నిర్మాణాలు చేపట్టే ఇంజినీర్ అయినా, ఆహారం అందించే రైతు అయినా, పాలన సాగించే అధికారి అయినా, వ్యాపారవేత్త అయినా లేదా సమాజాన్ని నడిపించే నాయకుడైనా.. వారి విజయం వెనుక వారిలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన ఒక ఉపాధ్యాయుడు కచ్చితంగా ఉంటారని ప్రశంసించారు.




## టీచరమ్మే మిస్ వరల్డ్ 2026

మొదటి పేజీ తరువాయి

విద్యను బోధిస్తున్నారు. ఆమె కమ్యూనిటీ సేవ, విద్యారంగంలో చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ కిరీటం దక్కిందని పలువురు ప్రశంసిస్తున్నారు. వచ్చే ఏడాది ఈ పోటీలకు టాంజానియా ఆతిథ్యం ఇవ్వనుంది. ఇదిలా ఉండగా, ఈ ఏడాది చివర్లో ప్యూర్టోరికోలో జరిగే మిస్ యూనివర్స్ పోటీల్లో భారత్ తరఫున కాజియా లిజ్ మేజో పాల్గొననున్నారు. ఈ పోటీల్లో భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించిన ఫెమినా మిస్ ఇండియా వరల్డ్ 2024 నికితా పోర్వాల్ టాప్ 40 వరకు చేరుకుంది. అయితే, ఆ తర్వాతి రౌండ్‌లో టాప్ 20లో ఆమెకు చోటు దక్కకపోవడంతో భారత అభిమానులకు నిరాశ ఎదురైంది.

## పింఛన్లకు ఫీల్డ్ వెరిఫికేషన్

మొదటి పేజీ తరువాయి

భాగంగా దరఖాస్తుదారుల అర్హతలను అధికారులు నేరుగా ఇళ్లకు వెళ్లి పరిశీలించాల్సి ఉంటుంది. వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులతో పాటు నివాస స్థితి, కోరుకున్న కేటగిరీకి అర్హులా? కాదా? అనే అంశాలను కూడా అధికారులు పరిశీలిస్తారు. దశలవారీగా కొత్త సామాజిక పెన్షన్ల మంజూరుకు సర్కారు ఈ చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో అర్హుల ఎంపిక విషయంలో వెరిఫికేషన్ అధికారులుగా జిల్లా కలెక్టర్లను నియమించింది. గ్రామీణ ప్రాంతాల్లో మండలస్థాయి అధికారులు, మున్సిపాల్టీలోనూ ప్రత్యేక అధికారులు వెరిఫికేషన్ నిర్వహించనున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సర్కిల్ స్థాయి అధికారులకు ఈ బాధ్యతలు అప్పగించింది. చేయూత పెన్షన్ల వెరిఫికేషన్ కోసం ప్రత్యేకంగా మొబైల్ యాప్‌ను ప్రభుత్వం రూపొందించింది. ఈ యాప్‌లోనే వెరిఫికేషన్ వివరాలు, అధికారుల రిమార్క్స్ నమోదుచేస్తారు. దరఖాస్తుదారుల నివాస ప్రాంతాల వారీగా వివరాలను అధికారులకు అందజేయనుంది. దరఖాస్తుదారులకు నిర్దేశించిన అర్హతలను కచ్చితంగా అధికారులు పరిశీలించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. దరఖాస్తుతో సమర్పించిన పత్రాలను కూడా తనిఖీ చేయాలని స్పష్టం చేసింది. అవసరమైన పత్రాలను సమర్పించకపోతే.. పరిశీలన సమయంలోనే వాటిని హోల్డ్‌లో పెట్టే అవకాశం ఉంటుందని తెలిపింది. ఆ పత్రం సమర్పించిన తర్వాతే వెరిఫికేషన్ పూర్తి చేయాలని మార్గదర్శకాల్లో వెల్లడించింది. అర్హతల నిర్ధారణ తర్వాతే చేయూత పింఛన్ల మంజూరుకు సిఫార్సు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది.

# రేవంత్ పేస్ట్ కారుద్ది

మొదటి పేజీ తరువాయి

చేస్తున్నారని, ఇందుకు వారికి సిగ్గనిపించడం లేదా అని నిలదీశారు. ఎన్నికలకు ముందు యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన 24 హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదని కేటీఆర్ ఫైర్ అయ్యారు. ఫుల్ పేజీ యాడ్స్ ఇచ్చి నవంబర్ 30న ఓటెయ్యండి.. డిసెంబర్ 4 లోపల 2 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇస్తామని బంపర్ ఆఫర్ ఇచ్చారని గుర్తుచేశారు. "మైసూర్ బజ్జీలో మైసూర్ ఎలాగైతే ఉండదో.. వీళ్ల జాబ్ క్యాలెండర్‌లో కూడా జాబ్స్ ఉండవు" అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నేతలు బకాసురులు, కుంభకర్ణుల్లా పందికొక్కుల్లా తింటూ పడుకుంటున్నారని ఘాటుగా విమర్శించారు. తెలంగాణను మూడు తరాల పాటు ముంచిన ముసలి నక్క కాంగ్రెస్ పార్టీయే అని కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 1956లో ఆంధ్రా, తెలంగాణల మధ్య ఇష్టం లేని బలవంతపు పెళ్లి చేసిందని, 1968లో 370 మందిని కాల్చి చంపిందని గుర్తు చేశారు. 1971లో ప్రజలు గెలిపించిన 11 మంది ఎంపీలను గుంజుకుని కాంగ్రెస్‌లో కలుపుకుందని విమర్శించారు. 2004లో సోనియా గాంధీ మాట ఇచ్చి పదేళ్లు సతాయించిందని, శ్రీకాంతాచారి లాంటి వందల మంది త్యాగాలు, కేసీఆర్ నిరాహార దీక్ష దెబ్బకే ఆ ముసలి నక్క దిగివచ్చి తెలంగాణ ఇచ్చిందని స్పష్టం చేశారు. కేసీఆర్‌ను రాజీనామా చేయాలని కాంగ్రెస్ నేతలు తీట మాటలు మాట్లాడుతున్నారని, 420 హామీలు ఇచ్చి మోసం చేసిన కాంగ్రెస్ వాళ్లే 420 సార్లు రాజీనామా చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. "మహేష్ బాబు సినిమాలో బ్రహ్మానందం 4 రోజులు ఎక్సర్‌సైజ్ చేసి 'హిట్ మీ యార్' అనగానే.. మహేష్ బాబు గట్టిగా ఒక్క గుద్దు గుద్దితే కిందపడి పేస్ట్ కారుతుంది. ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా కేసీఆర్‌తో పెట్టుకుంటే గదే రిపీట్ అవుతుంది" అని సెటైర్ వేశారు. ఎవడు కొడితే దిమ్మతిరిగి మైండ్ బ్లాంక్ అవుతుందో ఆయనే కేసీఆర్ అని, 2006 కరీంనగర్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ ఈపు పగిలిందని గుర్తుచేశారు. కేవలం మంత్రి కొండా సురేఖను మాత్రమే కాకుండా, ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్నే బర్తరఫ్ చేసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని కేటీఆర్ హెచ్చరించారు. పేదల భూములను నిషేధిత జాబితాలో పెట్టిన కాంగ్రెస్ పార్టీని కూడా త్వరలోనే ప్రజలు నిషేధిత జాబితాలో పెట్టడం ఖాయమని ఆయన తేల్చి చెప్పారు. కాంగ్రెస్ ట్రాప్ లో పడొద్దని యువతకు పిలుపునిచ్చారు.

# కేటీఆర్ నిక్కృష్టుడు

మొదటి పేజీ తరువాయి



చింతబరిగె తీసుకుని ఎల్బీనగర్ చౌరస్తాలో నిలబెట్టి కోదండం వేసి కొట్టకుండా ఆపింది. అందుకే బరితెగించి బద్మాష్‌లాగా మాట్లాడుతున్నారు. రేవంత్‌కు సంస్కారం లేకపోతే ఒక్కడు కూడా రోడ్డు మీద కాలు బెట్టడు.. ఫామ్ హౌజ్‌లో బొర్లా బొక్కలో పడుకోవాలి అని సీఎం అన్నారు. సీతక్క, కొండా సురేఖ ఇంటికి వస్తే స్వీట్ తినిపించి రాఖీ కట్టుకుని ఆడబిడ్డలకు గౌరవం ఇచ్చిన.. నీ సొంత చెల్లెలు రాఖీ కడుతానంటే ఆస్తిలో వాటాలో ఇవ్వాల్సి వస్తుందని రక్తం పంచుకుని తోడబుట్టిన చెల్లెల్ని మెడబట్టి గెంటేసిన నీచుడా, నిక్కృష్టుడా, గాడిదా.. నీకు నాకు పోలికా..! నాలుగు ఇంగ్లీష్ ముక్కలు వస్తే గొప్పోనివి అయినవా..? అమెరికాలో బాత్రూమల్ కడిగినవ్.. ఇక్కడ వస్తే హోటల్‌లో పని చేసినవ్.. మనం ఇక్కడ హోటల్‌కు వెళ్తే.. వాట్ కెన్ ఐ డూ ఫర్ యు సర్ అని వస్తరు.. అంతమాత్రాన ఆయన సైంటిస్టు అయితడా.. గుంటూరులో చదివి ఆ తెలివితేటలు చూపిస్తున్నాడు.. నీకు తెలంగాణలో చప్రాసీ నౌకరి కూడా ఇవ్వొద్దు.. కానీ ప్రజలు నిన్ను నమ్మితే.. నమ్మితిరా సిద్ద పెడితిరా సున్నం అన్నట్టు బందీపోట్ల మాదిరి తెలంగాణను దోచుకుతిన్నారు. నా చదువు గురించి మాట్లాడుతావా..? నీకు సంస్కారం ఉందా.. రా.. సభలో మాట్లాడుదాం. నీ చదువేందో.. నా చదువేందో.. నీ సంస్కారమేందో.. నా సంస్కారమేందో మాట్లాడుదాం.. నీతో ఎట్లాగు కాదు.. చర్చ సమయానికి గంజాయి కొట్టి పండుతవ్.. నీ అయ్యను, నీ బావను తీసుకురా.. సమాధానం చెబుతా సభలో. మర్యాదగా ఉంటే చేతగాని తనం అనుకుంటున్నరేమో.. మా కార్యకర్తలు అన్నట్టు.. సార్ అది పాము.. తోక తొక్కకు.. పడగ మీద కొట్టు అని అన్నరు. కోరలు పీకినం కదా దానితో అయ్యేది ఏముందేలే అన్నను. కార్యకర్తలు చెప్పింది నిజమే అనిపిస్తుంది. సంస్కారం ఉన్న పార్టీ ఇది' అని రేవంత్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

## ఓల్డ్ మాంక్ రమ్ కాదు

మొదటి పేజీ తరువాయి

ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై యాక్టింగ్ చీఫ్ జస్టిస్ రవీంద్ర వి ఘుగే, జస్టిస్ గౌతమ్ ఎ అంఖడ్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా, ఇది కేవలం రమ్‌ను అనుకరించే పానీయం మాత్రమేనని ఎఫ్ఎస్ఎస్ఏఐ తరఫు న్యాయవాది వాదించారు. అయితే, రమ్ నిర్వచనానికి అనుగుణంగానే తమ ఉత్పత్తి ఉందని, విక్రయాలు నిలిచిపోవడంతో సంస్థ భారీ ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటోందని కంపెనీ తరఫు న్యాయవాది కోర్టుకు విన్నవించారు. ఇరుపక్షాల వాదనలను పరిశీలించిన ధర్మాసనం, కంపెనీకి తక్షణ ఊరట (ఇంటెరిమ్ రిలీఫ్) ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ నేపథ్యంలో తయారీ సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. తమ ప్యాకేజింగ్‌పై 'యాడెడ్ ఫ్లేవర్' (ఫ్లేవర్ జోడించబడింది) అని స్పష్టంగా ముద్రిస్తామని, అలాగే '7 ఏళ్ల నాటి బ్లెండెడ్' అనే వాక్యాన్ని తొలగిస్తామని కోర్టుకు హామీ ఇచ్చింది. సవరించిన ఈ లేబుళ్లపై తమ స్పందన తెలియజేయాలని అదనపు సొలిసిటర్ జనరల్‌ను ఆదేశిస్తూ, తదుపరి విచారణను ధర్మాసనం సెప్టెంబర్ 8వ తేదీకి వాయిదా వేసింది.

## సర్ గడువు పొడిగించండి

మొదటి పేజీ తరువాయి

ఆయన శనివారం లేఖ రాశారు. ఈ గడువును పొడిగిస్తే అక్టోబర్ నుంచి నవంబర్ చివరి వారంలో రాష్ట్రంలో తుది ఓటర్ల జాబితా వెలువడే అవకాశాలున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా శనివారం వరకు 47.79 లక్షల ఓటర్లకు నోటీసులు జారీ చేశారు. నోటీసులు ఇచ్చిన సమయానికి 32.39 లక్షల మంది ఓటర్లు హాజరు కాలేకపోయారు. రాష్ట్ర వ్యాప్తంగా 5,74,504 మంది హియరింగ్ పూర్తి అయింది. కాగా ఇప్పటికే ఓటర్ల జాబితా సవరణకు తగినంత సమయం ఇవ్వాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఇంతకుముందు కేంద్ర ఎన్నికల ప్రధానాధికారికి లేఖ రాసిన విషయం తెలిసిందే.

# ఆరోగ్యమే అసలైన వికసిత్

## ఆరోగ్యం, పోషకాహారం, ఫిట్‌నెస్ ముఖ్యం.. ప్రజల్లో అవగాహన ఉద్యమంగా మారాలి.. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (పీఐబీ): ఆరోగ్యవంతమైన ప్రజలు లేకుండా ఆరోగ్యవంతమైన, అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించడం సాధ్యం కాదని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించాలంటే ఆరోగ్యం, పోషకాహారం, పరిశుభ్రత, ఫిట్‌నెస్, క్రీడలు, మహిళలు, పిల్లల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఏ.వి. కళాశాల ప్రాంగణంలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) ఆధ్వర్యంలో ఐదు రోజులుగా నిర్వహించిన జాతీయ పోషణ మాసోత్సవం ముగింపు కార్యక్రమానికి శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ పోషకాహారం, ఆరోగ్యకరమైన జీవన విధానంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు దేశవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. క్విజ్‌లు, పోస్టర్ తయారీ, వీడియోల తయారీ, పోషకాహార వంటకాల తయారీ వంటి పోటీల ద్వారా విద్యార్థులు, యువత, మహిళల్లో చైతన్యం తీసుకురావాలని అన్నారు. పోషణ మాసోత్సవం కేవలం ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ప్రజా ఉద్యమంగా మారాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై స్వయంగా బాధ్యత తీసుకోవాలని, పోషక విలువలున్న ఆహారం తీసుకోవడంతో పాటు తగినంత నిద్ర, వ్యాయామం, నడక, యోగా, క్రీడలను రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. అవసరానికి మించి నూనె, చక్కెర వినియోగాన్ని తగ్గించుకోవాలని చెప్పారు. చిన్నారులు, యువతలో అధిక బరువు, స్థూలకాయం వంటి సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో చిన్న వయస్సు నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పెంపొందించాలని సూచించారు. ఇంట్లో తయారు చేసే తాజా, పోషక విలువలున్న ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలని, జంక్‌ఫుడ్‌పై ఆధారపడే అలవాటును తగ్గించాలని అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం జీవనాన్ని సులభతరం చేసినప్పటికీ శారీరక శ్రమను తగ్గించిందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. సెల్‌ఫోన్, కంప్యూటర్, టెలివిజన్ వంటి డిజిటల్ పరికరాల వినియోగాన్ని పరిమితం చేయాలని సూచించారు. ముఖ్యంగా రాత్రివేళల్లో మొబైల్ వినియోగాన్ని తగ్గించి సమయానికి నిద్రపోవాలని అన్నారు. దేశ భవిష్యత్తును నిర్మించాల్సిన యువత మాదకద్రవ్యాల బారిన పడటం ఆందోళనకరమని కిషన్‌రెడ్డి అన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన కేవలం ప్రభుత్వ బాధ్యత కాదని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థలు, పోలీసు శాఖ, స్వచ్ఛంద సంస్థలతో పాటు సమాజంలోని ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. 'నషా ముక్త్ భారత్', 'ఫిట్ ఇండియా', 'డ్రగ్ ఫ్రీ ఇండియా' కార్యక్రమాలు కేవలం నినాదాలు కాదని, దేశ భవిష్యత్తు కోసం చేపడుతున్న కార్యక్రమాలని పేర్కొన్నారు.



యువతను ఆరోగ్యవంతంగా, శక్తివంతంగా తీర్చిదిద్దితేనే దేశం అభివృద్ధిలో మరింత ముందుకు సాగుతుందని అన్నారు. కేంద్ర మంత్రి పిలుపునిస్తూ 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు ఆరోగ్యవంతమైన సమాజం కీలకమని, ఈ దిశగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. పీఐబీ, సీబీసీ అదనపు డైరెక్టర్ జనరల్ శృతి పాటిల్ మాట్లాడుతూ ఐదు రోజుల కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పోషకాహారం, ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. వివిధ పోటీలు, కార్యక్రమాల ద్వారా సమతుల్య ఆహారం ప్రాధాన్యాన్ని వివరించామని చెప్పారు. అవగాహన కార్యక్రమం ముగింపు కాదని, ఆరోగ్యకరమైన జీవనశైలికి ఆచరణలో నాంది కావాలని అన్నారు. ప్రతి విద్యార్థి, ప్రతి కుటుంబం ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఎంచుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన, బలమైన భారతదేశ నిర్మాణానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సామ జగన్మోహన్‌రెడ్డి, ఏ.వి. ఎడ్యుకేషన్ బోర్డు సభ్యుడు కె. వినోద్‌రెడ్డి, ఏ.వి. కళాశాల కరస్పాండెంట్, సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు, సిబ్బంది, కళాశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.




## ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

ఫిర్జాదిగూడ, సెప్టెంబర్ 5 (ఈవార్తలు): ఆర్కే యువ భారత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్మన్ కన్నెబోయిన రాము యాదవ్ నేతృత్వంలో ఫిర్జాదిగూడలోని వినాయక్‌నగర్ కాలనీలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. కాలనీవాసులు, మహిళలు, యువతతో పాటు ఎన్ఐఎఫ్‌డీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చిన్నారులు, విద్యార్థులు ప్రదర్శించిన శ్రీకృష్ణుడు, రాధ వేషధారణలు, భక్తిగీతాలు, సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా రాము యాదవ్ మాట్లాడుతూ పూర్వీకులు అందించిన సనాతన ధర్మం, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. శ్రీకృష్ణుడు భగవద్గీత ద్వారా బోధించిన కర్మ సిద్ధాంతాన్ని నిత్యజీవితంలో ఆచరించి ధర్మబద్ధమైన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ముఖ్య వక్తగా హాజరైన శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ పీఠం అధిపతి యోగేష్ ప్రభు భగవద్ధ్వజాన్ని ఆవిష్కరించి గీతా సారాంశంపై ప్రసంగించారు. గీతా బోధనలు సర్వకాలీనమైనవని, దేశానికి, ధర్మానికి ఆపద ఎదురైనప్పుడు యువత ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు రావాలని సూచించారు. ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు సుదర్శన్‌రెడ్డి నిర్వాహకులను అభినందించారు. మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ మాట్లాడుతూ రాము యాదవ్ ఆధ్వర్యంలో ఫిర్జాదిగూడ, మేడిపల్లి ప్రాంతాల్లో శ్రీకృష్ణాష్టమితో పాటు హిందూ పండుగలను ఘనంగా నిర్వహిస్తూ ప్రజల్లో సాంస్కృతిక, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ స్వామి యాదవ్, బీజేవైఎం నాయకులు బండారు పవన్‌రెడ్డి, కన్నెబోయిన శ్రీనివాస్, బీజేపీ నాయకుడు ప్రభాకర్‌రెడ్డి, వివిధ కాలనీల ప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు.



## గౌతమ్ మోడల్ స్కూల్‌లో ఘనంగా టీచర్స్ డే

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 5 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణలో అలరించారు. తరగతి గదుల్లో తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పుతూ ఉన్నత భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేస్తున్న ఉపాధ్యాయులను విద్యార్థులు శాలువాలు కప్పి, బహుమతులు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బుర ఉమారమేష్ మాట్లాడుతూ విద్యార్థుల వ్యక్తిత్వ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి సమాజంలో ఉన్నత స్థానాలకు ఎదగడమే గురువులకు ఇచ్చే నిజమైన గురుదక్షిణ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ హరికిషన్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీవారి బ్రహ్మోత్సవాలకు పటిష్ఠ ఏర్పాట్లు

### భక్తుల కోసం సైన్ బోర్డులు..

తిరుమల, సెప్టెంబర్ 5 (ఈవార్తలు): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు సమీపిస్తున్నాయి. సెప్టెంబర్ 15వ తేదీ నుంచి తిరుమలలో శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తిరుమల తిరుపతి దేవస్థానం చర్యలు చేపడుతోంది. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా శ్రీవారిని దర్శించుకుని, వాహన సేవలను ఆనందంగా వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ సీవీఎస్‌వో మురళీకృష్ణ తెలిపారు. తిరుమల మాడవీధులు, ఇతర ప్రాంతాల్లో చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై ఎస్పీ సుబ్బరాయుడు, అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గత బ్రహ్మోత్సవాల అనుభవాలను పరిగణనలోకి తీసుకుని.. టీటీడీ విజిలెన్స్, పోలీస్ సిబ్బంది మరింత సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ సీవీఎస్‌వో మురళీకృష్ణ తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ధ్వజారోహణం రోజున సీఎం నారా చంద్రబాబు నాయుడు తిరుమలకు రానున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు. సీఎం పర్యటన నేపథ్యంలో పటిష్ఠమైన బందోబస్తు, బ్యారికేడింగ్ వంటి ఏర్పాట్లు చేస్తున్నట్లు మురళీకృష్ణ వెల్లడించారు. భక్తుల రద్దీకి తగినట్లుగా క్యూలైన్ల నిర్వహణతో పాటుగా ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలలో భద్రతా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలలో గరుడ సేవకు అత్యంత ప్రాధాన్యం ఉన్న సంగతి తెలిసిందే. గరుడ వాహన సేవ రోజున తిరుమల గిరులు భక్తులతో కిక్కిరిసిపోతాయి. ఈ నేపథ్యంలో తిరుమల, తిరుపతిలో పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపడుతున్నారు. పార్కింగ్ ప్రదేశాలను ముందుగానే పరిశీలించి ఏర్పాట్లు చేస్తున్నారు. భారీ సంఖ్యలో వాహనాలు వచ్చే అవకాశం ఉన్నందున.. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు టీటీడీ అధికారులు వెల్లడించారు. భక్తులకు అవగాహన కల్పించేందుకు తిరుపతి, తిరుమలలోని ముఖ్యమైన కూడళ్లలో వివిధ భాషల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. మరోవైపు బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. భక్తుల భద్రతతో పాటుగా.. క్రైమ్, ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. టీటీడీ విజిలెన్స్, పోలీస్, ఫైర్, అటవీశాఖ, ఇంటెలిజెన్స్, ఆర్టీసీ, రైల్వే శాఖల సమన్వయంతో అన్ని చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ వివరించారు.



## ఏపీ కాంగ్రెస్ కొత్త ఇంఛార్జిగా పీవీ మోహన్

న్యూఢిల్లీ/విజయవాడ, సెప్టెంబర్ 5 (ఈవార్తలు): సంస్థాగత నియామకాల్లో భాగంగా అఖిల భారత కాంగ్రెస్ కమిటీ పలు రాష్ట్రాలకు కొత్త ఇంచార్జిలను నియమించింది. ఈ క్రమంలోనే ఏపీ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జిగా పీవీ మోహన్‌ను నియమించింది. ప్రస్తుతం ఇంఛార్జిగా ఉన్న రమేష్ చెన్నితాల స్థానంలో పీవీ మోహన్‌ను నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. రాబోయే ఎన్నికలు, పార్టీ బలోపేతాన్ని దృష్టిలో ఉంచుకుని హస్తం పార్టీ ఈ నిర్ణయాలు తీసుకుంది. కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే కాకుండా.. స్థానిక నేతల మధ్య సమన్వయం సాధించేందుకు ఈ నియామకాలు చేపట్టింది. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జిగా పీవీ మోహన్‌ను నియమించారు. అలాగే మహారాష్ట్రకు శ్రీవెల్ల ప్రసాద్‌ను ఇంఛార్జిగా నియమించింది. పంజాబ్ జనరల్ సెక్రటరీ ఇంఛార్జిగా సచిన్ పైలట్‌కు బాధ్యతలు అప్పగించారు. గుజరాత్ కాంగ్రెస్ ఇంచార్జిగా రణదీప్ సుర్జేవాలా, అస్సాం ఇంఛార్జిగా భూపేశ్ బఘేల్‌ను కాంగ్రెస్ అధిష్ఠానం నియమించింది. ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జిగా సుఖ్‌దేవ్ భగత్ నియమితులు అయ్యారు. ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జిగా నియమితులైన పీవీ మోహన్.. కర్ణాటకకు చెందిన నేత. కర్ణాటక మాజీ ఎమ్మెల్సీగా వ్యవహరించారు. అలాగే ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ తరుపున వివిధ రాష్ట్రాలలో పీవీ మోహన్ పరిశీలకుడిగా పనిచేశారు. తెలంగాణలో ఇటీవల జరిగిన రంగారెడ్డి, వికారాబాద్ డీసీసీల ఎంపికలోనూ ఏఐసీసీ పరిశీలకులుగా పీవీ మోహన్ వ్యవహరించారు. మరోవైపు ఏపీలో కాంగ్రెస్ పార్టీ అస్థిత్వం కోసం పోరాడుతున్న సమయంలో.. పీవీ మోహన్ నియామకం హస్తం పార్టీ పరిస్థితులలో మార్పులు తెస్తుందా అనే ఆసక్తి నెలకొంది. పొరుగున ఉన్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. తమిళనాడులో ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంది. అయితే ఏపీలో మాత్రం కాంగ్రెస్ పరిస్థితి ఆశాజనకంగా లేదు. ఈ నేపథ్యంలోనే పీవీ మోహన్ నియామకం ద్వారా కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేసేందుకు ఏఐసీసీ ప్రణాళికలు రచిస్తోంది.

## విద్యా వ్యవస్థా? కార్పొరేట్ దోపిడీనా?

### ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల మోతపై రేవంత్‌ను నిలదీసిన కవిత

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (ఈవార్తలు): ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో విచ్చలవిడిగా సాగుతున్న ఫీజుల దోపిడీపై కల్వకుంట్ల కవిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల కట్టడికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కూల్ ఫీ రెగ్యులేటరీ కమిషన్‌ను తీసుకొస్తామని గతంలో ఇచ్చిన హామీ ఏమైందని, దానికి సంబంధించిన డ్రాఫ్ట్ బిల్లు రెండేళ్లుగా కేబినెట్ దాటి బయటకు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. స్వయంగా విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్న సీఎం రేవంత్ రెడ్డి... పేద, మధ్యతరగతి తల్లిదండ్రుల జేబులు గుల్లవుతున్నా ఎందుకు మౌనం వహిస్తున్నారని నిలదీశార

## ఏపీ మున్సిపల్ ఎన్నికల్లో కొత్త రూల్స్

### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



విజయవాడ, సెప్టెంబర్ 5 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కొత్త నిబంధనలను తీసుకువచ్చింది. ఈ మేరకు శనివారం రోజున రెండు వేర్వేరు జీవోలు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్( సవరణ) చట్టం, 2026 అమలుకు ఆమోదం తెలుపుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే మేయర్, వార్డు మెంబర్ల ఎన్నికల నిర్వహణ నిబంధనలను ఖరారు చేస్తూ ఏపీ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి జీవో నెం. 210, జీవో నెం. 211లను జారీ చేశారు. ఆగస్ట్ 28వ తేదీ నుంచే మున్సిపల్ చట్టాలకు చేసిన సవరణలు రాష్ట్రంలో అమల్లోకి వచ్చినట్లు జీవో నంబర్ 210లో పేర్కొన్నారు. ఈ సవరణల ఆధారంగా మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ జరగనుంది. అలాగే ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్స్ మేయర్, వార్డు మెంబర్స్ ఎన్నికల నిర్వహణ రూల్స్-2026 కూడా తక్షణమే అమల్లోకి తెస్తూ 211 జీవో జారీ చేశారు. మరోవైపు మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్లు మొదలుకొని ఓట్ల లెక్కింపు ప్రక్రియ వరకూ పకడ్బందీగా చేపట్టేందుకు నిబంధనలు రూపొందించారు. తాజాగా వెల్లడించిన రూల్స్ ప్రకారం.. మేయర్, కార్పొరేటర్ స్థానాలకు పోటీ చేయాలంటే..జనరల్ కేటగిరీ అభ్యర్థులు అయితే రూ.5,000 నామినేషన్ డిపాజిట్ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. పోటీ చేసే అభ్యర్థులు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన వారైతే.. రూ. 2,500 నామినేషన్ డిపాజిట్ కింద చెల్లించాలి. అలాగే ఒక అభ్యర్థి ఒక స్థానానికి గరిష్టంగా నాలుగు సెట్లు నామినేషన్ పత్రాలు దాఖలు చేయవచ్చు. అలాగే ఆస్తులు, అప్పులు, విద్యార్హత, నేరచరిత్రకు సంబంధించి నోటరీతో కూడిన అఫిడవిట్ తప్పనిసరి. అలాగే మేయర్, వార్డు సభ్యుల ఎన్నికల కోసం ప్రత్యేక ఓటింగ్ విధానం అనుసరించనున్నారు. అలాగే పోలింగ్ కేంద్రాల వద్ద ఎవరైనా రూల్స్ ఉల్లంఘిస్తే వారి ఓటును రద్దు చేసేలా నిబంధనలు రూపొందించారు. పోలింగ్ సమయంలో ఏవైనా అక్రమాలు, పొరబాట్లు జరిగితే బ్యాలెట్ పేపర్ వెనక్కి తీసుకునేలా ప్రిసైడింగ్ అధికారికి అధికారాలు కట్టబెట్టారు. మరోవైపు కడప నగరపాలక సంస్థ పరిధిలో వార్డుల డీలిమిటేషన్ ప్రక్రియ చేపడుతున్నారు. ఇందుకు సంబంధించిన షెడ్యూలు విడుదలైంది. ప్రస్తుతం ఉన్న 50 డివిజన్లను 66 డివిజన్లుగా పునర్విభజించనున్నారు. డీలిమిటేషన్ ప్రక్రియలో భాగంగా సెప్టెంబర్ 4 నాలుగో తేదీన డ్రాఫ్ట్ వార్డుల విభజన ప్రతిపాదనలు రూపొందించారు. వీటిపై సెప్టెంబర్ 5వ తేదీ నుంచి 11వ తేదీ వరకు సూచనలు, అభ్యంతరాలను స్వీకరిస్తున్నారు. సెప్టెంబర్ 13న డీలిమిటేషన్ ప్రతిపాదనలు ఆమోదం తెలిపి, సెప్టెంబర్ 14న తుది నోటిఫికేషన్ గెజిట్‌లో ప్రచురిస్తారు.

## బీడీ స్కాలర్‌షిప్ గడువు పొడిగింపు

హైదరాబాద్, సెప్టెంబర్ 4(ఈవార్తలు): బీడీ కార్మికుల పిల్లలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న విద్యా ఉపకార వేతనాలకు దరఖాస్తు గడువును సెప్టెంబర్ 30 వరకు పొడిగించినట్లు బీడీ కార్మికుల సంక్షేమ సంస్థ అధికారులు తెలిపారు. అర్హత కలిగిన బీడీ కార్మికుల పిల్లలు, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 2026 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఉపకార వేతనాల కోసం జాతీయ ఉపకార వేతనాల పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. గతంలో దరఖాస్తు చేసుకోలేకపోయిన అర్హులైన విద్యార్థులు సెప్టెంబర్ 30లోపు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకునే సమయంలో అవసరమైన అన్ని పత్రాలను సమర్పించాలని, వివరాలను సరిగ్గా నమోదు చేయాలని సూచించారు. ఉపకార వేతనాలకు సంబంధించిన పూర్తి వివరాలను జాతీయ ఉపకార వేతనాల పోర్టల్‌లో తెలుసుకోవచ్చని తెలిపారు. సందేహాల నివృత్తికి 0120-6619540 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.



## జగిత్యాలలో ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

జగిత్యాల, సెప్టెంబర్ 5 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో (ఐడీఓసీ) శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న పలువురు ఉపాధ్యాయులను అభినందించారు. తెలుగు భాషా పండితుల విభాగంలో జనుమంచి నర్సయ్య, గాజుల మహేందర్, మహ్మద్ హమీదుల్లాఖాన్, వల్లంపట్ల గిరీష్‌కుమార్ ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్నారు. అదేవిధంగా హిందీ ఉపాధ్యాయులకు కూడా జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు లభించాయి. అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులను ఆర్‌యూపీపీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కట్కం నరేందర్, ప్రధాన కార్యదర్శి చందా సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు అన్నారంభట్ల సూర్యనారాయణ, రాష్ట్ర బాధ్యుడు దండె రాజేందర్, జిల్లా, మండల బాధ్యులు, పండిత మిత్రులు అభినందించారు.

# విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలి

## సామాజిక విలువలు, క్రమశిక్షణ నేర్పాలి.. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల బ్యూరో, సెప్టెంబర్ 5 (ఈవార్తలు): విద్యార్థులను విద్యతో పాటు అన్ని రంగాల్లో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జిల్లాలోని 37 మంది ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్‌తో కలిసి ఆది శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ తల్లిదండ్రుల తర్వాత విద్యార్థులపై అత్యధిక ప్రభావం చూపేది ఉపాధ్యాయులేనన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం, మహాత్మా జ్యోతిరావు పూలే దంపతుల బోధనలను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి మనోవికాసం, సామాజిక విలువలు, కట్టుబాట్లు, క్రమశిక్షణపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచడంతో పాటు అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. డైట్, కాస్మొటిక్ చార్జీలను పెంచామని, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నామని తెలిపారు. ఉదయం అల్పాహారం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని, ఇప్పటికే 11 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించేందుకు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటుతో విద్యారంగంలో మార్పులకు శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. జిల్లాలో రెండు తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు రానున్నాయని చెప్పారు. ఐటీఐలను ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నామని, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని అన్నారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉపాధ్యాయులే ఆదర్శమన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తన విద్యార్థి దశలోని జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఉపాధ్యాయుల ప్రవర్తన, బోధనా విధానం విద్యార్థులపై ఎంతో ప్రభావం చూపుతాయని తెలిపారు. ఎన్నికల సమయంలో జిల్లాలో ఉపాధ్యాయులు సమర్థంగా విధులు నిర్వహించి ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు సహకరించారని ప్రశంసించారు. పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ (పీజీఐ), విద్యార్థుల నమోదు తదితర అంశాల్లో జిల్లా మెరుగైన ఫలితాలు సాధించిందన్నారు. ప్రతి విద్యార్థిని ఉత్తమంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, జిల్లా విద్యాధికారి మొండయ్య, కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్లయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి

### జీఓ-97 రద్దు చేయాలి.. కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ డిమాండ్

మెట్‌పల్లి, సెప్టెంబర్ 5 (ఈవార్తలు): విద్యార్థులు, యువతకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఎమ్మెల్యే డా. సంజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మెట్‌పల్లిలో ఆయన ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఎన్నికల సమయంలో జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగ నియామకాలు చేపడతామని, విద్యార్థులకు స్కూటీలు అందజేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని ఎమ్మెల్యే గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. పాలిటెక్నిక్ విద్యార్థులు, విద్యా వ్యవస్థకు నష్టం కలిగించే జీఓ-97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మొండివైఖరి వీడి వారికి అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని, మరోవైపు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందడం లేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వెంటనే జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, జీఓ--97ను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నాలో బీఆర్ఎస్ నాయకులు, యువత, విద్యార్థులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఇస్లాంపూర్‌లో భూభారతి రీ-సర్వే

గంగాధర, సెప్టెంబర్ 5 (ఈవార్తలు): భూభారతి రీ-సర్వే కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం ఇస్లాంపూర్ గ్రామంలో రెవెన్యూ, సర్వే అధికారులు డిజిటల్ సర్వే నిర్వహించారు. గ్రామ పరిధిలోని భూములకు సంబంధించిన వివరాలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నమోదు చేసే ప్రక్రియను చేపట్టారు. భూభారతి రీ-సర్వేలో భాగంగా గ్రామంలోని భూ సరిహద్దులు, భూముల విస్తీర్ణం, సంబంధిత రికార్డులకు సంబంధించిన వివరాలను పరిశీలిస్తూ డిజిటల్ విధానంలో సర్వే నిర్వహించారు. సర్వే ప్రక్రియ సక్రమంగా సాగేందుకు గ్రామస్థులు అధికారులకు సహకరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బారాజు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ పరిధిలో జరుగుతున్న డిజిటల్ సర్వే ప్రక్రియలో భూ యజమానులు, గ్రామ ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు. భూములకు సంబంధించిన వివరాల నమోదులో ఏవైనా సందేహాలు లేదా సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సర్వే, రెవెన్యూ అధికారులు గ్రామ పరిధిలో క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహిస్తూ సర్వే ప్రక్రియను కొనసాగించారు. భూ వివరాలను డిజిటల్ విధానంలో నమోదు చేయడంలో స్థానిక ప్రజల సహకారం అవసరమని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇస్లాంపూర్ గ్రామ సర్పంచ్ బారాజు ప్రభాకర్‌రెడ్డి, సర్వే, రెవెన్యూ అధికారులు, గ్రామ పాలకవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

జగిత్యాల, సెప్టెంబర్ 5 (ఈవార్తలు): పట్టణంలోని 40వ వార్డులో నాయిని బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, కళ్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. స్వామివారి కళ్యాణాన్ని తిలకించేందుకు వార్డు ప్రజలు, భగవద్బంధువులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ జరిగిన కళ్యాణ మహోత్సవం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ హాజరై శ్రీ లక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి కళ్యాణోత్సవంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. నాయిని బ్రాహ్మణ సంఘం నాయకులు, సభ్యులు, వార్డు ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కళ్యాణ మహోత్సవం సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తుల సందడితో కిటకిటలాడగా, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.



## విద్యార్థుల భవిష్యత్తు గురువుల బాధ్యత

గంగాధర, సెప్టెంబర్ 5 (ఈవార్తలు): కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని బూరుగుపల్లి మహాత్మ జ్యోతిబాపూలే బాలుర పాఠశాల, కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదని, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర కీలకమని అన్నారు. దేశ అభివృద్ధి విద్యార్థుల భవిష్యత్తుపై ఆధారపడి ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కైలాసం రాజు, వరుణ్, జ్యోతి, అంజయ్య, సత్యనారాయణ, శ్రావణ్‌కుమార్, సంపత్, ఆంజనేయులు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# హామీలు ఎక్కడ? ఉద్యోగాలు ఎక్కడ?

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి.. బీఆర్ఎస్ నేత జీవన్ రెడ్డి డిమాండ్



జగిత్యాల, సెప్టెంబర్ 5 (ఈవార్తలు): దేశ భవిష్యత్ అయిన విద్యార్థుల సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.జీవన్ రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన వైఫల్యం, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలపై జగిత్యాల ఆర్డీవో కార్యాలయం వద్ద వందలాది మంది విద్యార్థులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ ఎల్.రమణ, జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో 33 జిల్లాల్లో 33 మెడికల్ కళాశాలలు, 650 గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశారని, ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని పటిష్టంగా అమలు చేశారన్నారు. కేంద్రం ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం రూ.740 కోట్లు విడుదల చేసినా రాష్ట్ర వాటా ఇవ్వక నిధులు వెనక్కి వెళ్లాయని, కళాశాలలకు రూ.12 వేల కోట్లు బకాయి ఉందని ఆరోపించారు. 2 లక్షల ఉద్యోగాల హామీతో 33 నెలలైనా 33 వేల ఉద్యోగాలు ఇవ్వలేదని, తులం బంగారం, కేసీఆర్ కిట్ నిలిపివేశారని విమరి ంచారు. జగిత్యాల ఎమ్మెల్యే బీఆర్ఎస్ తరపున గెలిచి కాంగ్రెస్ లో చేరారని, పార్టీ మారితేనే అభివృద్ధి జరుగుతుందా అని ప్రశ్నించారు. అనంతరం ఎమ్మెల్సీ ఎల్.రమణ మాట్లాడుతూ 100 రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి వెయ్యి రోజులైనా అమలు చేయలేదని, కేసీఆర్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా పోరాటం చేస్తున్నామన్నారు. రేవంత్ కు కమీషన్లపై ఉన్న శ్రద్ధ పేద విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ పై లేదని, గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు మాట్లాడుతూ విద్యార్థుల ఖాతాల్లో డబ్బులు వేస్తామనడం కొత్త నాటకమని, యువతకు స్కూటీలు, నిరుద్యోగ భృతి ఇవ్వలేదని, అన్ని వర్గాలను మోసం చేశారని అన్నారు. హామీలు నెరవేర్చే వరకు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక చవితికి విద్యుత్ భద్రతే ప్రధానం

### జగిత్యాల సర్కిల్ ఎస్ఈ సుదర్శనం సూచన



జగిత్యాల, సెప్టెంబర్ 5 (ఈవార్తలు): ఈ నెల 14న నిర్వహించనున్న వినాయక చవితి వేడుకల్లో విద్యుత్ భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని జగిత్యాల సర్కిల్ ఎస్ఈ బి. సుదర్శనం సూచించారు. గణేష్ మండపాలు, విద్యుత్ అలంకరణలు, విగ్రహాల తరలింపు, నిమజ్జన సమయంలో ప్రమాదాలు జరగకుండా ప్రజలు, మండప నిర్వాహకులు, విద్యుత్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. నిమజ్జన మార్గాల్లో విద్యుత్ లైన్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను ముందుగానే తనిఖీ చేయాలని, ఎత్తైన విగ్రహాలు, క్రేన్లు విద్యుత్ తీగలకు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండపాల్లో నాణ్యమైన వైర్లు, రక్షణ పరికరాలు వినియోగించాలని, తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లకు దూరంగా ఉండాలన్నారు. తెగిపోయిన విద్యుత్ తీగలు, లూజ్ లైన్లు కనిపిస్తే తాకకుండా వెంటనే 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. విద్యుత్ భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి పండుగను సురక్షితంగా నిర్వహించుకోవాలని ఎస్ఈ విజ్ఞప్తి చేశారు.



## వర్తక సంఘం నూతన కార్యవర్గానికి రమణ అభినందనలు

జగిత్యాల టౌన్, సెప్టెంబర్ 5 (ఈవార్తలు): జగిత్యాల చాంబర్ ఆఫ్ కామర్స్ (వర్తక సంఘం) నూతన కార్యవర్గ సభ్యులు శాసనమండలి ఉపనేత, ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్. రమణను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా కమటాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా పెద్ది శ్రీనివాస్, కోశాధికారిగా కప్పల శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా ఎలిమిల్ల చంద్రకాంత్, సహాయ కార్యదర్శిగా సామ సునీల్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా ఈ భేటీ జరిగింది. నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్సీ ఎల్. రమణ అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.



## కూడా చైర్‌పర్సన్‌గా సుధారాణి బాధ్యతలు

హనుమకొండ, సెప్టెంబర్ 5 (ఈవార్తలు): కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కూడా) చైర్‌పర్సన్‌గా గుండు సుధారాణి శనివారం బాధ్యతలు స్వీకరించారు. హనుమకొండలోని కూడ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా యూత్ నాయకులు వేల్పుల నితీష్ మిట్టు, శ్రీకాంత్, రాకేష్‌లు సుధారాణిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నితీష్ మిట్టు మాట్లాడుతూ గతంలో మేయర్‌గా పనిచేసిన గుండు సుధారాణి పేదలు, బడుగు, బలహీన వర్గాల కోసం చేసిన సేవలు అభినందనీయమన్నారు. కూడ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పన, పట్టణాభివృద్ధి పనులను మరింత వేగవంతం చేసేలా ఆమె కృషి చేస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శిరీష్, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి అవకతవకలపై బీజేపీ దీక్ష

సిరిసిల్ల, సెప్టెంబర్ 5 (ఈవార్తలు): కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న భూ భారతి విధానంలో చోటుచేసుకుంటున్న అవకతవకలను నిరసిస్తూ బీజేపీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద శనివారం నిర్వహించిన మహా దీక్షకు రాజన్న సిరిసిల్ల జిల్లా బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు. జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి నేతృత్వంలో నాయకులు దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు, శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి శేషవస్త్రం, కండువాలను కప్పి సత్కరించారు. అనంతరం రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ భూ భారతి విధానం కారణంగా రైతులు, పేదలు, మధ్యతరగతి ప్రజలు తమ భూములకు సంబంధించిన సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రజల భూములను సెక్షన్ 22-ఏ నిషేధిత జాబితాలో చేర్చడంపై ప్రభుత్వం పునరాలోచించాలని డిమాండ్ చేశారు. బాధితుల భూ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, ప్రజలకు న్యాయం జరిగే వరకు బీజేపీ వారి పక్షాన పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి, కోశాధికారి ఆసాని రామలింగారెడ్డి, వివిధ మండల, పట్టణ అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైద్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: ఎస్పీఎస్

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (ఈవార్తలు): ప్రభుత్వ ఆసుపత్రుల్లో శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ, సూపర్‌వైజర్ విభాగాల్లో పనిచేస్తున్న బెడ్‌సైడ్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న మహాధర్నా నిర్వహించనున్నట్లు ఎస్పీఎస్ మెడికల్ అండ్ హెల్త్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కుర్రి సైదయ్య తెలిపారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని డీఎంఈ కార్యాలయంలో అదనపు డీఎంఈకి ధర్నా నోటీసు అందజేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా సైదయ్య మాట్లాడుతూ బెడ్‌సైడ్ కాంట్రాక్ట్ కార్మికుల విధానాన్ని రద్దు చేసి, వారిని నేరుగా ఐఎఫ్ఎంఐఎస్‌లో విలీనం చేసి నెలకు రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై గత మే 25న డీఎంఈ కార్యాలయాన్ని ముట్టడించిన సందర్భంగా అధికారులు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహతో పాటు ఉన్నతాధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందించినా కార్మికుల వేతనాలు, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా తదితర సమస్యలపై స్పష్టమైన నిర్ణయం తీసుకోలేదని ఆరోపించారు. 2022లో జారీ చేసిన జీవో నంబర్ 60 ప్రకారం టెండర్ల విధానంలో కార్మికులను మధ్యవర్తుల ద్వారా వెట్టి చాకిరీ చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ హక్కులపై ప్రశ్నిస్తున్న కార్మికులను తాండూరు, మిర్యాలగూడ, నల్గొండ, మహబూబ్‌నగర్, ఏటూరునాగారం తదితర ప్రాంతాల్లో ఉద్యోగాల నుంచి తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.



## ఎస్పీఆర్‌లో రక్తదాన శిబిరం

హనుమకొండ, సెప్టెంబరు 5: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్ శివారులోని ఎస్పీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. హనుమకొండ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 50 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ గౌరిశెట్టి జగన్మోహన్ మాట్లాడుతూ రక్తదానం నేటి సమాజంలో అత్యవసర సామాజిక బాధ్యతగా మారిందన్నారు. ఒక వ్యక్తి చేసే రక్తదానం పలువురి ప్రాణాలను కాపాడుతుందని పేర్కొన్నారు. ప్రాణాలను నిలబెట్టే ప్రతి రక్తపు చుక్క ఎంతో విలువైనదని అన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే సామాజిక సేవా కార్యక్రమాలపై అవగాహన పెంచుకుని బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని సూచించారు. రక్తదాన శిబిరం విజయవంతానికి సహకరించిన ప్రధానోపాధ్యాయుడు శేషగిరిరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, మిత్రులు, శ్రేయోభిలాషులకు జగన్మోహన్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు శేషగిరిరావు మాట్లాడుతూ రహదారి ప్రమాదాలు, అత్యవసర వైద్య పరిస్థితుల్లో రక్తం అత్యంత అవసరమవుతుందని తెలిపారు. ప్రమాద బాధితుల ప్రాణాలను కాపాడటంలో స్వచ్ఛంద రక్తదానం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

## టీచర్ల ఏడుపు మంచిది కాదు: బండి

కరీంనగర్, సెప్టెంబర్ 5 (ఈవార్తలు): ఉపాధ్యాయుల కన్నీళ్లతో ఏ దేశం కానీ, రాష్ట్రం కానీ బాగుపడదని, ఈ పచ్చి నిజాన్ని కాంగ్రెస్ పాలకులు తక్షణమే గ్రహించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ అర్ధాకలితో అలమటిస్తూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న గురువులందరికీ శుభాకాంక్షలు తెలిపుతున్నానని అన్నారు. రాష్ట్రంలో పీఆర్సీ అమలు కాకపోయినా, డీఏలు ఇవ్వకపోయినా ఓర్పుతో ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారని కొనియాడారు. బడినే సర్వస్వంగా భావించి కొవ్వొత్తిలా కరిగిన రిటైర్డ్ టీచర్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాక మలిసంధ్యలో ఆఫీసుల చుట్టూ కాళ్లకు చెప్పులరిగేలా తిరగడం అత్యంత విచారకరమన్నారు.

**తెలంగాణ రాజకీయ తెరపై కొండా దంపతుల కథ ఇప్పుడు ఉత్కంఠభరితమైన మలుపు తిరిగింది. ఒకప్పుడు ప్రత్యర్థుల గుండెల్లో గుబులు పుట్టించిన కొండా సురేఖ.. ఇప్పుడు తన ప్రతి అడుగును కొలిచి వేయాల్సిన పరిస్థితిలో నిలిచారా? బిడ్డ కోసం గళమెత్తితే పార్టీతో పేచీ.. పార్టీని వీడితే రాజకీయంగా చేరేందుకు మరో గమ్యం కనిపించని సంకట స్థితి! కూతురి మాటలకు అండగా నిలవాలా.. కాంగ్రెస్ క్రమశిక్షణకు కట్టుబడి మౌనంగా ఉండాలా అన్న సందిగ్ధం కొండా కుటుంబాన్ని చుట్టుముట్టిందా? రేవంత్ రెడ్డి వ్యూహంలో చిక్కుకున్నారా.. లేక ఇదంతా రాజకీయంగా వేసిన మరో ఎత్తుగడా? ఒకవైపు అధిష్ఠానం హెచ్చరికలు.. మరోవైపు బీఆర్ఎస్ తలుపులు మూసేశామన్న స్పష్టమైన సంకేతాలు.. ఇప్పుడు బీజేపీ కూడా అసంతృప్త నేతలకు తమ పార్టీ 'డంపింగ్ బిన్' కాదని చెప్పడంతో కొండా దంపతుల ముందున్న దారులు ఒక్కొక్కటిగా మూసుకుపోతున్నాయా? గతంలో ప్రత్యర్థులపై చేసిన ఘాటు వ్యాఖ్యలే ఇప్పుడు తిరిగి రాజకీయ ఆయుధాలుగా మారుతున్నాయా? జగన్‌పై నాటి దూకుడు.. బీఆర్ఎస్ నేతలపై బూతులు, సవాళ్లు.. అన్నీ కలిసి కొత్త లెక్కలు వేస్తున్న వేళ.. "బిడ్డ వేరు.. మా దారి వేరు" అన్న కొండా సురేఖ మాటల వెనుక అసలు వ్యూహం ఏమిటి? కాంగ్రెస్‌లోనే ఉండి రాజకీయ మనుగడను కాపాడుకోవడం తప్ప మరో మార్గం లేదా?**

(ఈవార్తలు - పొలిటికల్ స్టోరీ)

## రాజకీయంగా దారులన్నీ మూసుకుపోయాయా?

తెలంగాణ రాజకీయాల్లో కొండా దంపతుల చుట్టూ ఇప్పుడు కనిపిస్తున్న పరిణామాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. కూతురు కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు.. తల్లి కొండా సురేఖ రాజకీయ భవిష్యత్తుకు కొత్త చిక్కులు తెచ్చాయా? అనే చర్చ మొదలైంది. ఒకవైపు కాంగ్రెస్‌లో కొనసాగాల్సిన పరిస్థితి కనిపిస్తుంటే.. మరోవైపు బయటకు వెళ్లే మార్గాలు ఒక్కొక్కటిగా మూసుకుపోతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. కొండా సురేఖ తన కూతురు వ్యాఖ్యలకు రాజకీయంగా సంబంధం లేదన్నట్టుగా వ్యవహరించాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? అన్న ప్రశ్న ఇప్పుడు రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. కొండా దంపతులు క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నారన్న అభిప్రాయం బలపడుతోంది. ముఖ్యంగా కుటుంబం కోసం దూకుడుగా ముందుకు వెళ్తే రాజకీయంగా నష్టం జరిగే అవకాశం ఉందన్న అంచనా వారిని ఆలోచనలో పడేసినట్టుగా కనిపిస్తోంది. బిడ్డ కోసం ఒక అడుగు ముందుకు వేస్తే పార్టీ పరంగా ఇబ్బంది.. వెనక్కి తగ్గితే కుటుంబపరంగా ఒత్తిడి అనే ద్వంద్వ పరిస్థితి ఏర్పడిందన్న చర్చ సాగుతోంది. దీంతో కొండా దంపతులు ఇకపై రాజకీయంగా చాలా జాగ్రత్తగా అడుగులు వేయాల్సిన పరిస్థితి ఏర్పడిందనే విశ్లేషణ వినిపిస్తోంది. ఒకప్పుడు తమదైన శైలిలో దూకుడుగా రాజకీయాలు చేసిన కొండా దంపతులు ఇప్పుడు ప్రతి మాటను కొలిచి మాట్లాడాల్సి వస్తోందన్నది తాజా పరిణామాల సారాంశంగా కనిపిస్తోంది.



# కొండా.. వద్దు మా నెత్తిన బండ!

## మాకొద్దంటున్న పార్టీలు.. రాజకీయదారులు క్లోజ్?

## ఉన్న ఒకే ఆప్షన్ జనసేన? కలిసివస్తుందా.. 'కాపు' స్టాంపు!

### రేవంత్ విసిరిన వలలో చిక్కారా?

కొండా దంపతుల రాజకీయ పరిస్థితిని పరిశీలిస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ వ్యూహం కూడా చర్చకు వస్తోంది. రేవంత్ విసిరిన రాజకీయ వలలో కొండా దంపతులు చిక్కుకున్నారా? అన్న ప్రశ్నకు తెలంగాణ రాజకీయాల్లో భిన్నమైన సమాధానాలు వినిపిస్తున్నాయి. పరకాల నుంచి వచ్చే ఎన్నికల్లో రేవూరి ప్రకాష్ రెడ్డి మరోసారి పోటీ చేస్తారంటూ రేవంత్ చేసిన వ్యాఖ్యల తర్వాత కొండా ఫ్యామిలీలో ముసలం పుట్టింది. కొండా దంపతులు మొదట తమకు ఎదురవుతున్న సమస్యను కూతురు ద్వారా బయటకు ఎక్స్‌పోజ్ చేసిందువల్ల పరిస్థితి ఇంత దూరం వెళ్తుందని ఊహించి ఉండకపోవచ్చన్న అభిప్రాయం ఉంది. కూతురితో మాట్లాడిస్తే విషయం సద్దుమణుగుతుందని భావించి ఉండొచ్చని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే అనుకున్నది ఒకటి.. జరిగింది మరోటి అన్నట్టుగా పరిణామాలు మలుపు తిరిగాయి. వ్యక్తిగత వ్యాఖ్యగా మొదలైన అంశం.. పార్టీ క్రమశిక్షణ.. నాయకత్వంపై విశ్వాసం.. భవిష్యత్ రాజకీయ సమీకరణాల చర్చగా మారింది. కొండా సురేఖను అలా వదిలేస్తే.. కాంగ్రెస్ చూస్తూ ఊరుకుంటే పార్టీకి నష్టం జరుగుతుందని రేవంత్ రెడ్డి అధిష్ఠానం వద్ద తన వాదన వినిపించారన్న రాజకీయ చర్చ కూడా ఉంది. అదే సమయంలో కొండా దంపతులను సాగనంపితే పార్టీకి పెద్దగా నష్టం ఉండదన్న వాదన కూడా వినిపించిందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ రెండు వాదనల మధ్య అసలు రాజకీయ లెక్క దాగి ఉందని పరిశీలకులు చెబుతున్నారు. కొండా దంపతులు తమ రాజకీయ బలాన్ని చూపించేందుకు ప్రయత్నిస్తే అది పార్టీ అధిష్ఠానం వద్ద వేరే అర్థం తీసుకునే అవకాశం ఉంది. అందుకే రాజకీయ దూకుడు తగ్గించి.. పార్టీ గీత దాటకుండా ఉండటమే ప్రస్తుతం సురక్షిత మార్గం అన్న భావన బలపడుతున్నట్టు కనిపిస్తోంది.

### గులాబీ తలుపులు మూసేశారా?

కొండా సురేఖకు కాంగ్రెస్ బయట రాజకీయ ప్రత్యామ్నాయం ఉందా అన్న ప్రశ్నకు కూడా తాజా పరిణామాలు ఆసక్తికర సమాధానం ఇస్తున్నాయి. గతంలో కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్ వైపు వెళ్లే అవకాశాలపై రాజకీయ చర్చలు జరిగినా.. ఇప్పుడు ఆ మార్గం దాదాపు మూసుకుపోయినట్టుగా సంకేతాలు కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్‌లోకి కొండా సురేఖకు ప్రవేశం లేదన్న సందేశం చాలా స్పష్టంగా బయటకు వచ్చింది. మాజీ మంత్రి బీఆర్ఎస్ నేత జగదీష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ విషయంలో ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కొండా సురేఖను తిరిగి బీఆర్ఎస్‌లోకి తీసుకునే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. కొండా దంపతులను తెలంగాణ భవన్ గేటు కూడా తాకనివ్వబోమన్న స్థాయిలో ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గతంలో బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన నేతలను తిరిగి పార్టీలోకి తీసుకునే విషయంలో గులాబీ పార్టీ కఠిన వైఖరితో ఉందని ఆయన చెప్పడం చర్చకు దారితీసింది. ఒకరిద్దరు నేతలకు మినహాయింపు ఉండొచ్చని.. మిగతా వారికి పార్టీ తలుపులు తెరవబోమని ఆయన స్పష్టం చేసినట్లు రాజకీయ వర్గాలు గుర్తు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొండా సురేఖకు బీఆర్ఎస్ ఒక ప్రత్యామ్నాయ రాజకీయ వేదికగా మిగలలేదన్న భావన బలపడుతోంది. కాంగ్రెస్‌లో అసంతృప్తి ఏర్పడినా వెంటనే బీఆర్ఎస్ వైపు వెళ్లే అవకాశం లేకపోవడం కొండా దంపతుల పరిస్థితిని మరింత సంక్లిష్టం చేస్తోంది. రాజకీయంగా ఒక తలుపు మూసుకుపోతే మరో తలుపు తెరుచుకోవాలి. కానీ ఇప్పుడు ఆ రెండో తలుపు కూడా పూర్తిగా తెరుచుకోలేదన్న పరిస్థితి కనిపిస్తోంది. ఇదే సమయంలో బీజేపీ వైపు కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## బీజేపీ నుంచి కూడా స్పష్టమైన సంకేతం

కొండా సురేఖ బీజేపీలో చేరతారన్న ఊహాగానాలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న సమయంలో బీజేపీ సీనియర్ నేత మురళీధర్ రావు చేసిన వ్యాఖ్యలు కీలకంగా మారాయి. బీజేపీని అసంతృప్తి నేతల కోసం రాజకీయ డంపింగ్ బిన్‌గా చూడొద్దన్న సందేశాన్ని ఆయన స్పష్టంగా ఇచ్చారు. మీడియా ప్రతి రాజకీయ సంక్షోభంలోనూ బీజేపీ పేరును ఎందుకు లాగుతోందని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో ఏదైనా అంతర్గత సంక్షోభం కనిపిస్తే వెంటనే బీజేపీలో చేరికలపై కథనాలు రావడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నిస్తూ ఎక్స్ వేదికగా ఆయన తన అభిప్రాయాన్ని వెల్లడించారు. కాంగ్రెస్‌లో ఏర్పడుతున్న సమస్యను ముందుగానే ముగించేందుకు.. రాజకీయ చర్చను మరోవైపు మళ్లించేందుకు ఇలాంటి ఊహాగానాలు ఉపయోగపడుతున్నాయా అని ఆయన ప్రశ్నించారు. మురళీధర్ రావు వ్యాఖ్యలను పరిశీలిస్తే కొండా సురేఖను బీజేపీ తక్షణ రాజకీయ ప్రత్యామ్నాయంగా చూస్తోందన్న సంకేతం కనిపించలేదు. ఇదే కొండా దంపతుల ప్రస్తుత పరిస్థితిలో మరో కీలక అంశంగా మారింది. ఒకవైపు బీఆర్ఎస్ నుంచి గట్టి నిరాకరణ.. మరోవైపు బీజేపీ నుంచి కూడా స్వాగత సంకేతాలు కనిపించకపోవడం.. కాంగ్రెస్‌లోనే ఉండాల్సిన రాజకీయ అవసరాన్ని పెంచుతోంది. గతంలో కొండా సురేఖ రాజకీయ ప్రత్యర్థులపై తీవ్రస్థాయిలో విరుచుకుపడిన తీరు ఇప్పుడు తిరిగి చర్చకు వస్తోంది. ముఖ్యంగా బీఆర్ఎస్ నేతలపై ఆమె చేసిన తీవ్ర వ్యాఖ్యల వీడియోలు సామాజిక మాధ్యమాల్లో మళ్లీ వైరల్ అవుతున్నాయి. గతంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై కూడా ఆమె తీవ్ర విమర్శలు చేసిన విషయాన్ని కొందరు రాజకీయ నేతలు గుర్తు చేస్తున్నారు. దీంతో ప్రతి పార్టీతోనూ ఏదో ఒక దశలో తీవ్ర రాజకీయ విభేదాలు ఏర్పడిన నాయకురాలిగా ఆమెపై ఒక ప్రత్యేక రాజకీయ ముద్ర పడుతోందన్న చర్చ మొదలైంది. కొందరు ప్రచారం చేస్తున్నట్టుగా తెలంగాణలో జగన్మోహన్ రెడ్డి పార్టీ ప్రారంభిస్తే అందులోనూ కొండా దంపతులకు చోటు ఉంటుందా అన్న చర్చ కూడా జరుగుతోంది.

## రాజయ్యలా రాజీ.. కొండా ఫ్యామిలీకి తప్పదా?

తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో గత పరిణామాలను గుర్తు చేసుకుంటే.. పార్టీ నాయకత్వంతో విభేదాలు వచ్చిన సందర్భాల్లో కొందరు నేతలు చివరకు రాజీ మార్గాన్నే ఎంచుకున్న ఉదాహరణలు ఉన్నాయి. ఇప్పుడు కొండా దంపతుల విషయంలో కూడా అలాంటి పరిస్థితి ఏర్పడిందా అన్న చర్చ మొదలైంది. నాడు బీఆర్ఎస్ హయాంలో బర్తరఫ్ అయిన మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య రాజీపడినట్టుగా.. ఇప్పుడు కొండా దంపతులు కూడా రాజకీయంగా వెనక్కి తగ్గాల్సిన పరిస్థితి వచ్చిందా? అన్న ప్రశ్నకు ప్రస్తుత పరిణామాలు బలం చేకూరుస్తున్నాయి. బిడ్డ కోసం దూకుడుగా ముందుకు వెళ్తే కాంగ్రెస్‌తో దూరం పెరిగే అవకాశం ఉంది. కాంగ్రెస్‌తో దూరం పెరిగితే బయటకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న ప్రత్యామ్నాయ వేదికలు కూడా స్పష్టంగా కనిపించడం లేదు. బీఆర్ఎస్ ఇప్పటికే కఠినమైన సంకేతం ఇచ్చింది. బీజేపీ కూడా అసంతృప్తి నేతల కోసం తమ పార్టీ తలుపులు తెరిచి ఉంచలేదన్న సందేశాన్ని ఇచ్చింది. ఈ నేపథ్యంలో కొండా దంపతులకు ప్రస్తుతం కాంగ్రెస్‌లోనే కొనసాగడం రాజకీయంగా తప్పనిసరి మార్గంగా మారిందన్న భావన బలపడుతోంది. అయితే కాంగ్రెస్‌లో కొనసాగడం అంటే గతంలో ఉన్నట్టుగా స్వేచ్ఛగా రాజకీయ దూకుడు ప్రదర్శించడం కాదని కూడా తాజా పరిణామాలు చెబుతున్నాయి. కూతురు దారి వేరు.. తమ దారి వేరు అన్న స్పష్టమైన రాజకీయ రేఖను గీయాల్సిన అవసరం ఏర్పడింది. ఇకపై కొండా సురేఖ కాంగ్రెస్ నాయకురాలిగానే తన రాజకీయ గుర్తింపును బలపరచుకోవాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. పార్టీ నిర్ణయాలను గౌరవించడం.. వ్యక్తిగత రాజకీయ భేదాలను పార్టీ వ్యవస్థకు దూరంగా ఉంచడం.. అధిష్ఠానం విశ్వాసాన్ని తిరిగి బలపరచడం ఆమె ముందున్న ప్రధాన సవాళ్లుగా కనిపిస్తున్నాయి. కొండా అంటే వామ్మో అనే స్థాయిలో రాజకీయ భయం ఏర్పడిందా? లేక ఇది ఒక తాత్కాలిక రాజకీయ దశ మాత్రమేనా? అన్నది రాబోయే రోజుల్లో తేలనుంది. కానీ ప్రస్తుతం మాత్రం బిడ్డ కోసం ఒక అడుగు వేస్తే రాజకీయ భవిష్యత్తు ప్రమాదంలో పడే అవకాశం.. రాజకీయంగా వెనక్కి తగ్గితే కుటుంబపరమైన అసంతృప్తి మిగిలే అవకాశం కనిపిస్తోంది. అందుకే కొండా దంపతులు మౌనం.. సంయమనం.. పార్టీతో రాజీ అనే మూడు మార్గాలపైనే నడవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నది తాజా రాజకీయ చిత్రంగా కనిపిస్తోంది.



## జగన్‌పై నాటి దూకుడు గుర్తు

కొండా సురేఖ రాజకీయ ప్రయాణాన్ని వెనక్కి తిరిగి చూస్తే.. ఆమె మాట తీరు ఎప్పుడూ దూకుడుగానే కనిపించింది. ప్రత్యర్థి పార్టీలు.. ప్రత్యర్థి నాయకులపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేయడం ఆమె రాజకీయ శైలిలో భాగంగా మారింది. గతంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో తమ రాజకీయమని మాట్లాడిన మాటలు, ఆ తర్వాత ఆయనపై చేసిన తీవ్ర విమర్శలను ఇప్పుడు కొందరు రాజకీయ వర్గాలు ప్రస్తావిస్తున్నాయి. అదే సమయంలో బీఆర్ఎస్ అగ్రనేతలపై గతంలో ఆమె చేసిన ఘాటు వ్యాఖ్యలను కూడా గుర్తు చేస్తున్నారు. ఈ పాత వ్యాఖ్యలే ఇప్పుడు భవిష్యత్ రాజకీయ ప్రయాణానికి అడ్డంకులుగా మారుతున్నాయా? అన్న ప్రశ్న కూడా తలెత్తుతోంది. రాజకీయాల్లో శాశ్వత శత్రుత్వాలు ఉండరని సాధారణంగా చెబుతారు. కానీ ఒక నాయకుడు గతంలో చేసిన తీవ్ర వ్యాఖ్యలు.. భవిష్యత్‌లో అదే పార్టీతో రాజకీయంగా కలిసే సందర్భంలో ఇబ్బందులు సృష్టించే అవకాశం ఉంటుంది. కొండా సురేఖ విషయంలో ఇప్పుడు అదే అంశం చర్చకు వస్తోంది. బీఆర్ఎస్‌లోకి వెళ్లే అవకాశం లేదన్న ఆ పార్టీ నేతల వ్యాఖ్యలు.. బీజేపీ నుంచి వచ్చిన తాజా సంకేతాలు కలిపి చూస్తే కాంగ్రెస్ వెలుపల ఆమెకు తక్షణ రాజకీయ స్థలం కనిపించడం లేదన్న విశ్లేషణ బలపడుతోంది. అందుకే ఇప్పుడు కొండా సురేఖ రాజకీయంగా తనను తాను కాంగ్రెస్ వాదిగానే ప్రదర్శించుకోవాల్సిన అవసరం ఏర్పడిందన్న వాదన వినిపిస్తోంది. కూతురు సుస్మిత రాజకీయంగా వేరే దారిలో మాట్లాడినా.. ఆ వ్యాఖ్యలకు తాను సంబంధం లేనట్టుగా వ్యవహరించాల్సిన పరిస్థితి రావడానికి ఇదే ప్రధాన కారణమని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. కుటుంబ బంధం ఒకటి.. రాజకీయ పార్టీ ప్రయోజనం మరోటి. ఈ రెండింటిని వేరు చేసి చూపించకపోతే పరిస్థితి మరింత క్లిష్టంగా మారే అవకాశం ఉందన్న అంచనా ఉంది.

## చివరి అస్త్రం.. జనసేన!

కొండా దంపతుల రాజకీయ ప్రయాణంలో ఇప్పుడు జనసేన అస్త్రం తెరపైకి వస్తోందా? కాంగ్రెస్‌లో కొనసాగాలా.. మరో దారి వెతకాలా అన్న సందిగ్ధంలో ఉన్న సమయంలో పవన్ కల్యాణ్ నేతృత్వంలోని జనసేన తెలంగాణలో విస్తరించేందుకు ప్రయత్నాలు చేస్తుండటం ఆసక్తికరంగా మారింది. 2024 ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన పోటీ చేసిన 21 స్థానాల్లో 21 గెలిచి 100 శాతం స్ట్రైక్‌రేట్ సాధించానంటోంది. ఇప్పుడు తెలంగాణలోనూ పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టింది. కొండా సుస్మిత జనసేన నాయకత్వంతో సంప్రదింపులు జరుపుతున్నారన్న వార్తలు కూడా తాజాగా వెలువడ్డాయి. దీంతో కొండా దంపతుల ముందున్న రాజకీయ లెక్కల్లో జనసేన కూడా ఒక అవకాశంగా కనిపిస్తోంది. అయితే అసలు ట్విస్ట్ ఇక్కడే.. కొండా దంపతుల దూకుడు.. పవన్ కల్యాణ్ రాజకీయ శైలి.. ఈ రెండింటి మధ్య డీలింగ్ ఎలా ఉంటుంది? కాపు సమీకరణం తెలంగాణలో ఆశించినంతగా పనిచేయకపోయినా, కొండా కుటుంబానికి ఉన్న రాజకీయ పరిచయాలు, ప్రభావం జనసేనకు ఉపయోగపడతాయా అన్నది ఆసక్తికరం. తాజా పరిస్థితుల్లో ఇది మార్గమా.. మళ్లీ మరో మలుపా? అన్నది చూడాలి.

## కొండా కిం కర్తవ్యం

ఇక అసలు ప్రశ్న ఒక్కటే.. ఈ తీరం ఏ నావకు చేరుతుంది? కొండా దంపతుల రాజకీయ నావకు కాంగ్రెస్ తీరం కనిపిస్తున్నా.. అక్కడి అలలు మాత్రం ప్రశాంతంగా లేవు. బీఆర్ఎస్ తలుపులు మూసేసింది.. బీజేపీ గేటు దగ్గరికి వచ్చినా "ఇది రాజకీయ పునరావాస కేంద్రం కాదు" అన్నట్టుగా చూస్తోంది. కాంగ్రెస్ మాత్రం "నావలో ఉన్నవారు దిగాల్సిన అవసరం లేదు.. కానీ తెడ్డు మాత్రం మా చేతిలోనే ఉండాలి" అన్నట్టుగా సంకేతాలు ఇస్తోంది. కూతురు ఒక దిశలో ఈదుతుంటే.. తల్లిదండ్రులు మరో దిశలో తీరాన్ని వెతుకుతున్నారు. కుటుంబం ఒకే పడవలో ఉందా.. లేక ఒక్కొక్కరు ఒక్కో తెప్పపై ప్రయాణిస్తున్నారా అన్నది కూడా స్పష్టంగా లేదు. నిన్నటి వరకు ప్రత్యర్థులపై విరుచుకుపడిన మాటలు.. ఇవాళ రాజకీయ బరువును కొలిచే తూకాలుగా మారాయి. ఎవరిని విమర్శించాలి.. ఎవరిని పలకరించాలి.. ఎవరిని దూరంగా ఉంచాలి అన్న లెక్కల్లోనే తెడ్డు తిరుగుతోంది. అయితే రాజకీయాల్లో నావకు దిశ కంటే.. గాలి ముఖ్యం. గాలి మారితే నావ కూడా మారుతుంది.. నావికుడి సిద్ధాంతం కూడా మారుతుంది. చివరకు కొండా నావ కాంగ్రెస్ ఒడ్డునే కట్టేస్తారా.. లేక కొత్త జెండా ఎగరేసి మరో తీరం వైపు బయలుదేరుతారా అన్నది కాలమే చెప్పాలి.




# మానసిక అడ్డంకులు దాటు!

## పంత్‌కు రైనా కీలక సలహా

టీమిండియా వికెట్ కీపర్–బ్యాటర్ రిషభ్ పంత్ టెస్టు క్రికెట్‌లో అద్భుతంగా రాణిస్తున్నప్పటికీ, పరిమిత ఓవర్ల ఫార్మాట్లలో మాత్రం అదే స్థాయి ప్రదర్శన చేయలేకపోతున్నాడు. దీనిపై భారత మాజీ బ్యాటర్ సురేశ్ రైనా స్పందించాడు. పంత్‌లో అపారమైన ప్రతిభ ఉందని, మానసిక అడ్డంకులను అధిగమించి, ఎలాంటి సంకోచం లేకుండా ఆడితే వైట్ బాల్ క్రికెట్‌లోనూ టెస్టు ఫామ్‌ను పునరావృతం చేయగలడని రైనా విశ్వాసం వ్యక్తం చేశాడు. టెస్టుల్లో మ్యాచ్ విన్నర్‌గా పేరు తెచ్చుకున్నప్పటికీ, పంత్ వన్డేలు, టీ20ల్లో తన స్థానాన్ని సుస్థిరం చేసుకోలేకపోయాడు. అతను ఇప్పటివరకు 31 వన్డేలు, 76 టీ20లు ఆడాడు. చివరిసారిగా 2024లో భారత జట్టు తరఫున వైట్ బాల్ మ్యాచ్ ఆడాడు. ఆ తర్వాత 2025 ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన జట్టులో ఉన్నా, తుది జట్టులో అవకాశం రాలేదు. ఈ ఏడాది జూన్‌లో ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన సిరీస్‌కు వన్డే జట్టు నుంచి కూడా అతడిని తప్పించారు. ఆకాశ్ చోప్రా యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడుతూ రైనా ఈ వ్యాఖ్యలు చేశాడు. "పంత్ నా ఫేవరెట్ ప్లేయర్. అతను టెస్టుల్లో అద్భుతంగా ఆడుతూ భారీ స్కోర్లు చేస్తున్నాడు. జట్టులో ధ్రువ్ జురెల్, సంజూ శాంసన్ వంటి వారు ఉన్నా, పంత్‌లో ఒక ప్రత్యేకమైన ఎక్స్–ఫ్యాక్టర్ ఉంది. అతను నెమ్మదిగా పరిణతి చెందుతున్నాడు" అని రైనా పేర్కొన్నాడు.

# ఇమ్రాన్‌పై మానవత్వం చూపండి: లారా

పాకిస్థాన్ మాజీ కెప్టెన్, మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ జైలు జీవితం, ఆయన ఆరోగ్యంపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రీడాకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ జాబితాలో తాజాగా వెస్టిండీస్ క్రికెట్ దిగ్గజం బ్రయాన్ లారా కూడా చేరాడు.



జైల్లో ఉన్న ఇమ్రాన్‌కు గౌరవప్రదమైన, స్వతంత్ర వైద్య సంరక్షణ అందించాలని లారా డిమాండ్ చేశాడు. ఈ విషయంపై ఇప్పటికే గళం విప్పిన అంతర్జాతీయ మాజీ కెప్టెన్లకు తాను అండగా నిలుస్తున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించాడు. "మైదానంలో ఇమ్రాన్ ఖాన్, నేను కొన్నిసార్లు మాత్రమే తలపడ్డాం. కానీ ఆయనపై నాకు కలిగిన గౌరవం తక్షణమే ఏర్పడి, శాశ్వతంగా నిలిచిపోయింది" అని లారా తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో రాశాడు. "ఒకప్పుడు తన దేశానికి ఆశాజ్యోతిగా, గర్వకారణంగా, స్ఫూర్తి ప్రదాతగా నిలిచిన వ్యక్తి, ఇప్పుడు కనీస గౌరవం, కరుణకు నోచుకోని పరిస్థితుల్లో ఉండటాన్ని జీర్ణించుకోలేకపోతున్నాను. ప్రతీ మనిషికి తగిన గౌరవంతో పాటు, సరైన వైద్య సంరక్షణ ఆయనకు అందాలని కోరుతున్న తోటి మాజీ కెప్టెన్లతో నేను ఏకీభవిస్తున్నాను. ఇది రాజకీయాలకు సంబంధించిన విషయం కాదు. మన క్రీడారంగంలోని ఒక దిగ్గజానికి చూపించాల్సిన కనీస మానవత్వం" అని లారా తన ఆవేదనను వ్యక్తం చేశాడు.

# తండ్రి పేరుతో సచిన్ కొత్త ఫెలోషిప్

భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తన తండ్రి, తన మొదటి గురువు అయిన ప్రొఫెసర్ రమేశ్ టెండూల్కర్‌ను స్మరించుకున్నారు. ఆయన స్మారకార్థం 'ప్రొఫెసర్ రమేశ్ టెండూల్కర్ మెమోరియల్ ఫెలోషిప్'ను ప్రకటించి తన తండ్రికి ఘన నివాళి అర్పించారు. విద్య ద్వారా లభించిన అవకాశాలను సమాజ సేవకు ఉపయోగించాలన్న తన తండ్రి ఆశయాన్ని ముందుకు తీసుకెళ్లేందుకే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు సచిన్ తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఒక ప్రకటన చేశారు. 'ఈ ఉపాధ్యాయ దినోత్సవం రోజున, నాలో ఏదో ఉందని నమ్మి, నేను ఏమవుతానో ఊహించిన ఆ మొదటి వ్యక్తిని గౌరవించుకునే అవకాశం తీసుకుంటున్నాను. మా ఆరోగ్య సంరక్షణ భాగస్వామి ఇంగా హెల్త్ ఫౌండేషన్‌తో కలిసి ప్రొఫెసర్ రమేశ్ టెండూల్కర్ మెమోరియల్ ఫెలోషిప్పు ప్రవేశపెడుతున్నందుకు గర్వంగా ఉంది.






# పాక్ చిత్తు చిత్తు!

**55 పరుగులకే చాపచుట్టేసిన దాయాది.. మహిళల ఆసియా కప్‌లో భారత్ ఘన విజయం**

**చెరో 3 వికెట్లతో రాణించిన శ్రీ చరణి, ప్రేమ రావత్.. 8.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించిన మహిళలు**

మహిళల ఆసియా కప్ 2026 టోర్నీలో భారత జట్టు అద్భుత ప్రదర్శనతో అదరగొట్టింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో ఏకపక్ష విజయాన్ని నమోదు చేసింది. భారత బౌలర్ల ధాటికి పాకిస్థాన్ బ్యాటింగ్ లైనప్ పేకమేడలా కూలిపోయింది.

తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ జట్టు కేవలం 55 పరుగులకే ఆలౌట్ కాగా, భారత్ సునాయాసంగా లక్ష్యాన్ని ఛేదించింది. దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన పాకిస్థాన్ కెప్టెన్ ఫాతిమా సనా బ్యాటింగ్ ఎంచుకుంది. అయితే, ఆమె నిర్ణయం బెడిసికొట్టింది. భారత బౌలర్లు కట్టుదిట్టమైన బంతులతో పాక్ బ్యాటర్లను ఉక్కిరిబిక్కిరి చేశారు. 27 పరుగుల వద్ద తొలి వికెట్ కోల్పోయిన పాకిస్థాన్, ఆ తర్వాత వరుసగా వికెట్లు చేజార్చుకుంది. భారత బౌలర్లలో శ్రీ చరణి (4 ఓవర్లలో 7 పరుగులిచ్చి 3 వికెట్లు), ప్రేమ రావత్ (4 ఓవర్లలో 9 పరుగులిచ్చి 3 వికెట్లు) అద్భుతంగా రాణించారు. వారికి దీప్తి శర్మ (3.1 ఓవర్లలో 5 పరుగులిచ్చి 2 వికెట్లు) తోడవడంతో పాక్ కోలుకోలేకపోయింది. పాకిస్థాన్ ఇన్నింగ్స్‌లో మునీబా అలీ (13), షవాల్ జుల్ఫికర్ (14) మాత్రమే రెండంకెల స్కోరు చేయగలిగారు. చివరికి 18.1 ఓవర్లలో 55 పరుగులకే పాక్ కథ ముగిసింది. అనంతరం 56 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే షాక్ తగిలింది. పాక్ కెప్టెన్ ఫాతిమా సనా తన అద్భుత బౌలింగ్‌తో షఫాలీ వర్మ (12), ప్రతికా రావల్ (4), స్మృతి మంధన (9) వికెట్లను పడగొట్టింది. దీంతో



భారత్ 29 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కాస్త తడబడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (18 నాటౌట్), దీప్తి శర్మ (12 నాటౌట్)తో కలిసి మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడారు. వీరిద్దరూ నిలకడగా ఆడి జట్టును విజయతీరాలకు చేర్చారు. కేవలం 8.4 ఓవర్లలోనే భారత్ 3 వికెట్లు నష్టపోయి 57 పరుగులు చేసి ఘన విజయాన్ని అందుకుంది.



# ఉంటే ఉండండి.. లేకపోతే వేరే చూస్కోండి!

**క్రికెటర్లకు ప్రత్యేకంగా సదుపాయాలు కల్పించం**

**బీసీసీఐకి ఒలింపిక్ సంఘం షాక్**

ఆసియా క్రీడల్లో క్రికెటర్ల సౌకర్యార్థం మౌలిక వసతులు లేకపోవడంపై అసంతృప్తితో ఉన్న బీసీసీఐకి భారత ఒలింపిక్ సంఘం షాకిచ్చింది. జపాన్‌లోని ఐచీ– నగోయాలో టెంట్‌లోనే డ్రెస్సింగ్ రూమ్, 500 మీటర్ల దూరంలో వాష్‌రూమ్‌పై భారత బోర్డు ఫిర్యాదును తిరస్కరించింది. నిర్వాహకులు ఏర్పాటు చేసిన వాటితోనే సర్దుకుపోవాలని సూచించింది ఐఓఏ. ఒకవేళ టీమిండియా క్రికెటర్లకు ఇబ్బందిగా ఉంటుందని భావిస్తే.. సొంత ఖర్చుతో ఏర్పాట్లు చేసుకోవచ్చని పేర్కొంది. దాంతో.. టోర్నీ నిర్వాహకులను నమ్ముకునే కంటే భారత ప్లేయర్ల కోసం మెరుగైన వసతులు కల్పించడంపై బీసీసీఐ దృష్టి సారించనుంది. సెప్టెంబర్ 19వ తేదీ నుంచి జపాన్ వేదికగా ఆసియా క్రీడలు మొదలవ్వనున్నాయి. అయితే.. ఈ మెగా ఈవెంట్‌లో పాల్గొనే అథ్లెట్లు, క్రికెటర్లకు వసతులు, ఏర్పాట్లు మాత్రం ఆశించిన స్థాయిలో లేవు. టెంట్లలో లేదా కంటైనర్లలో వసతి, ఆమడ దూరంలో టాయిలెట్లు.. వంటివి క్రికెటర్లకు అసౌకర్యాన్ని కలిగిస్తాయని వాపోతున్న బీసీసీఐకి కీలక సూచన చేసింది భారత ఒలింపిక్ సంఘం. టైమ్ ఆఫ్ ఇండియా కథనం ప్రకారం.. వసతులపై అభ్యంతరం ఉంటే




సొంతంగా ఏర్పాటు చేసుకునేందుకు అభ్యంతరం చెప్పబోమని బీసీసీఐకి ఐఓఏ స్పష్టం చేసింది. 'బీసీసీఐ సీఈవో హేమంగ్ అమిన్ మాతో టచ్‌లో ఉన్నారు. జపాన్‌లో వసతుల పరిశీలన కోసం బీసీసీఐ ఓ బృందాన్ని పంపిస్తోంది. అందుకు మాకు అభ్యంతరం లేదు. ఆసియా క్రీడల్లో ఇలా వసతులపై ఫిర్యాదులు రావడం ఇదే మొదటిసారి. భారత బృందాన్ని ఒకేలా చూస్తాం. అందుకే క్రికెటర్లకు వసతుల్లో మార్పులు చేయలేం. ఈ పరిస్థితుల్లో అథ్లెట్ల మంచీచెడూ బీసీసీఐ చూసుకోనుంది. వసతుల పరంగా కొత్త మార్పులేవీ ఉండబోవని భారత ఒలింపిక్ సంఘం స్పష్టం చేసినట్టు సమాచారం. నిర్వాహకులు ఏర్పాటు చేసిన చోటనే బస చేయాలి. 'మా వల్ల కాదంటే మాత్రం.. సొంతంగా ఏర్పాటు చేసుకోవచ్చు' అని బీసీసీఐకి ఐఓఏ తేల్చి చెప్పింది' అని ఐఓఏ సీఈవో రఘురామ్ అయ్యర్ వెల్లడించారు.

# వైభవ్ కోసమే నా భార్య క్రికెట్ చూస్తోంది: క్రిష్ శ్రీకాంత్




భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఆటకు ఫిదా అవ్వని వారు అరుదు. మాజీ ఆటగాళ్ల నుంచి.. ప్రస్తుతం ఆడుతున్న క్రికెటర్లు సైతం ఈ పదిహేనేళ్ల కుర్రాడి ప్రతిభకు అవాక్కవుతున్నారు. అందుకే.. అతడు మైదానంలో దిగగానే చిన్నాపెద్దా అనే తేడా లేకుండా స్టేడియాల్లో వాలిపోతున్నారు. ఇంట్లోనే టీవీలకు అతుక్కుపోతున్నారు చాలామంది. తన భార్య కూడా వైభవ్ ఆటను తెగ ఇష్టపడుతోందని టీమిండియా దిగ్గజం క్రిస్ శ్రీకాంత్ తెలిపాడు. ఐపీఎల్‌లో తుఫాన్ ఇన్నింగ్స్‌లతో అంతర్జాతీయ టీ20ల్లో అరంగేట్రం చేసిన వైభవ్ సూర్యవంశీ కోసం అభిమానులు స్టేడియాలకు పోటెత్తుతున్నారు. నిండా పాతికేళ్లైనా లేని ఈ కుర్రాడి బ్యాటింగ్ మెరుపులు కళ్లారా చూసి మురిసిపోయేందుకు దేశవాళీ క్రికెట్‌ను సైతం చూసేస్తున్నారు. వైభవ్ రాకతో దులీప్ ట్రోఫీ(ణబశ్రీవవజూ ఞతీశీజూష్ట్రఎ) మ్యాచ్ కూడా చూసే వాళ్ల సంఖ్య పెరిగింది. వీరిలో మాజీ సెలెక్టర్ క్రిస్ శ్రీకాంత్ భార్య కూడా ఉంది. ఈ విషయాన్ని అతడే స్వయంగా వెల్లడించాడు. యూట్యూబ్ షోలో మాట్లాడిన శ్రీకాంత్.. 'మనందరం హాయిగా కూర్చొని దులీప్ ట్రోఫీ చూస్తున్నాం . ఇందుకు కారణం వైభవ్. మనలో చాలామందిమి అతడి ఆట కోసమే ఈ టోర్నీ చూస్తున్నాం. నా భార్య విద్య కూడా వైభవ్ బ్యాటింగ్ కోసమే దులీఫ్ ట్రోఫీ మ్యాచ్‌లు చూస్తోంది. ఐపీఎల్, టీ20.. తరహాలో ప్రేక్షకులు ఆ దేశవాళీ క్రికెట్ మ్యాచ్‌లపై ఆసక్తి చూపడానికి కారణం వైభవ్. అయితే.. అతడు 90ల్లో ఔటవుతున్నాడు. కానీ, అతడి హిట్టింగ్ అద్భుతం. సెమీఫైనల్లో సెంట్రల్ జోన్‌పై 81 బంతుల్లో 92 రన్స్‌తో చెలరేగాడు. అయినా సరే అతడు పెద్ద మ్యాచుల్లో ఆడగలడా? అనే సందేహం వెలిబుచ్చుతున్నారు.

ఈవార్తలు
# ప్రజావాణి
ఆదివారం 6-9-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు




# బీసీలు.. టిష్యూ పేపర్లు

పనిచేసుకొని బతికే కులం..
అన్యాయాన్ని ఎదిరించదు ఆ గళం..
రాజకీయం అంటేనే వాళ్లకు గరళం..
కులపోడు గొప్పోడైతే మాత్రం అవుతారు అగ్నిగోళం..
తోడుగా నిలబడాల్సి వస్తే మాత్రం నిశ్చలం..
ఇలాగైతే, బీసీలకు ఎప్పటికీ దక్కదు ప్రతిఫలం..

మున్నూరుకాపులు.. సగం బీసీలు, సగం ఓసీలు
పద్మశాలీలు.. పక్కోడితో పనేంది? మన పని మనది
గౌడలు.. గర్జించినా, గళమెత్తినా పెనం మీద పొంగినట్టే
యాదవులు.. ఉన్నోడే గొప్పోడు, మిగితోళ్లు చిన్నోళ్లు
ముదిరాజులు.. ఎదిగినోడే ఎదుగుతాడు
రజకులు.. కొందరే ఉన్నోళ్లు; కనిపించరు కండ్లకు
...పెరిక, బెస్త, మంగళి, వడ్డెర, కుమ్మరి, కమ్మరి, మేదరి..
ఇలా బీసీల్లోని ప్రతి కులానిది ప్రతికూలతే.



"అరే..! మన బీసీ బిడ్డకు అన్యాయం చేసిండ్రు.. అంటే ఈరోజు వంద నోళ్లు లేస్తాయి, రేపు పది నోళ్లు లేస్తాయి. ఎల్లుండి ఒక్క కూతా కూయదు. ఇంతటి 'గొప్ప' ఐక్యత కలిగిన వర్గం.. బీసీ వర్గం. అందుకే బీసీలంటే టిష్యూ పేపర్లు. దశాబ్దాలు గడిచినా ఐక్యత సాధించలేని ఒకే ఒక్క జాతి.. బీసీ జాతి. కులం పేర మీటింగ్ పెడితే బట్టలు చింపుకుంటరు. బీసీ గర్జన అంటే.. మూలుగుతూ కూసుంటరు. అందుకే బీసీలు టిష్యూ పేపర్లు అనేది. వాడుకొని అలా వదిలేస్తారంతే."



శ్రావణ్ కుమార్ బొమ్మకంటి
ఎడిటర్ - ఎంటెక్, ఎల్ఎల్బీ
9581291919,
9441291919

శ్రావణ వాణి

బీసీలు అణచివేతకు గురికావడం లేదు. అణచివేతలో భాగం అవుతున్నారు, అణచివేసేందుకు సాయం చేస్తున్నారు. తోటి బీసీకైనా సరే.. పక్కలో బల్లెంలా తయారైతరు. సపోజ్.. ఒక బీసీ వేదికపై బీసీ పెద్దలు కూర్చుంటే.. అందులో మన కులపోడు ఉన్నాడా? అని వెతికే రకం బీసీలది. ఒకవేళ వేదికపై లేడో.. మా కులపోడు చిన్నోడు అయిపోయిండా? వేదికపైకి ఎందుకు పిల్వలే? గద్దె మీద కూసున్నోళ్లు అంత పోటుగాళ్లా? అని కూతలు కూసే రకం. ఇక, బీసీ సంఘాలు ఉంటే.. ఆ సంఘాల్లో ఒకే కులానికి ప్రాతినిధ్యం అధికంగా దక్కడమో, లేక ఉన్నత పదవులు కొన్ని కులాలకే రావడమో జరగడం వల్ల బీసీల్లోని ఇతర కులాలు జీర్ణించుకోలేకపోతున్నాయి. బీసీల ఐక్యత గురించి సభలు జరుగుతాయి. తీర్మానాలు చేస్తారు. జెండాలు ఎగురవేస్తారు. నినాదాలు ఇస్తారు. కానీ వేదికపై ఒక కులానికి చెందిన నాయకుడు కనిపించకపోతే వెంటనే.. "మా కులం వాడిని ఎందుకు పిలవలేదు?" ప్రశ్న వస్తది. బీసీ సంఘంలో ఒక కులానికి ఎక్కువ పదవులు వస్తే మరో కులం అసంతృప్తి చెందుతుంది. అధ్యక్ష పదవి ఒకరికి వస్తే కార్యదర్శి పదవి కూడా అదే వర్గానికి దక్కకూడదనే పోటీ మొదలవుతుంది. చివరకు బీసీ సంఘం.. బీసీ ఐక్యతకు వేదిక కాకుండా కులాల పోటీకి వేదికగా మారుతుంది. ఇదే రాజకీయ పార్టీలకు వరం. బీసీలు విడిపోతే అధికారానికి పంచాయితీ ఉండదు. బీసీలు కులాలుగా పోట్లాడితే అధికారం కొందరి చేతుల్లోనే ఉంటుంది. బీసీ నాయకులు ఒకరినొకరు కిందకు లాగుకుంటే.. పైకి ఎక్కేవాళ్లకు మెట్లు అవసరం ఉండదు.

బీసీలలో ఒక విచిత్రమైన మానసిక స్థితి ఉంది. "మనం పని చేసుకుని బతికేవాళ్లం.. రాజకీయాలు మనకెందుకు?" అనే భావన తరతరాలుగా నాటుకు పోయింది. ఇదే భావన బీసీలను రాజకీయంగా వెనక్కి నెట్టింది. ఇతర వర్గాల్లో రాజకీయాన్ని కుటుంబ వారసత్వంగా చూస్తే.. బీసీలలో రాజకీయాన్ని చాలామంది ఇప్పటికీ అదనపు భారంగా చూస్తున్నారు. ఫలితం? డబ్బున్నవాడు రాజకీయాల్లోకి వస్తాడు. పలుకుబడి ఉన్నవాడు రాజకీయాల్లోకి వస్తాడు. కుటుంబ నేపథ్యం ఉన్నవాడు రాజకీయాల్లోకి వస్తాడు. బీసీ మాత్రం ఎన్నికల సమయంలో ఓటు వేస్తాడు. జెండా మోస్తాడు. సభకు జనాన్ని తీసుకొస్తాడు. పోస్టర్లు అంటిస్తాడు. నాయకుడి కోసం నినాదాలు వేస్తాడు. టికెట్ అడిగే దగ్గరికి వచ్చేసరికి వెనక్కి తగ్గుతాడు. ఇది మారకపోతే బీసీ రాజకీయ సాధికారత అనేది సాధ్యం కాని కార్యమవుతుంది. ఎవరైనా వచ్చి బీసీల కోసం మాట్లాడితే.. ఫస్ట్, అతను ఏ కులం? ఏ పార్టీ? ఎవరికి దగ్గర? ఎవరికి పేరు వస్తుంది? అని లెక్కలు వేసే బీసీ ఉద్యమం నేడు నడుస్తోంది. అందుకే ఆ ఉద్యమం ఎదగడం లేదు. రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు లాంటి వాళ్లు.. హాయిగా పెన్షన్ డబ్బులతో కాలం గడిపేయొచ్చు. కానీ, ఆయన బీసీల్లో అనైక్యతను పోగొట్టి ఐకమత్యాన్ని పెంచేందుకు నిత్య యజ్ఞం చేస్తున్నారు. దొరికిన వేదికపై తన గళాన్ని వినిపిస్తున్నారు. బీసీ రాజ్యం ఎందుకు రావాలి? బీసీలు ఎందుకు ఎదగాలి? బీసీలకు ఏం కావాలి? బీసీ రాజ్యాధికార సాధనకు ఏం చేయాలి? అన్న అంశాలపై నిత్యం వేల మందికి గైడెన్స్ ఇస్తున్నరు. కానీ, ఆయనకు తోడుగా నిలవాల్సిన బీసీ రాజకీయ నాయకులు ఆ పక్కకు కూడా వెళ్లరు. ఎక్కడ క్రెడిట్ చిరంజీవులుకు పోతదోనన్న భయం వాళ్లది.

## బీసీ గోడ కట్టుడు సాధ్యమేనా?

బీసీలకు అన్నింటికన్నా పెద్ద అడ్డంకి.. కులం. కులం గోడలను అడ్డం పెట్టుకొని, బీసీ గోడ కడదామనుకుంటే ఎలా సాధ్యం అవుతుంది? బీసీలం అని చెప్పుకోవడం కంటే.. మా కులం ఇదీ అని చెప్పుకోవడానికే మక్కువ చూపుతారు జనం. బీసీల్లో మేమే పెద్దోళ్లం. ఆ కులపోళ్లు చిన్నోళ్లు అని ఈసడించుకునే మనస్తత్వం బీసీ కులాలది. బీసీ కులం కానివాళ్లు వచ్చి బీసీలను ఉద్ధరిస్తామని చెప్తున్నారంటే.. బీసీలు ఎంత నిద్ర మత్తులో ఉన్నారో అర్థం అవుతోందిగా. బీసీ ఐక్యత అంటే ఒకే కులం కాదు. ఒక సామాజిక వాస్తవం. ఆ వాస్తవాన్ని రాజకీయ శక్తిగా మార్చడానికి ముందుగా బీసీలు ఒకరినొకరు ప్రత్యర్థులుగా చూడటం ఆపాలి. బీసీలపై వేటు వేయాలంటే పాలకులు భయపడే పరిస్థితి రావాలి. అందుకు బీసీలు నడుం బిగించాలి. కానీ, చద్దర్ కప్పుకొని నిద్రపోతరు.

ప్ర: 'జీ' ఒరిగెస్తే ఏం జరిగింది?

బీసీ నాయకులు.. రాజకీయాల్లో రాణించాలంటే బీసీ కార్డు వాడుతారు. తాను బీసీ బిడ్డనని చెప్పుకొని ఓట్లు దండుకుంటారు. తీరా గెలిచాక బీసీ అన్న పదమే వాళ్లకు గుర్తుకురాదు. కులసంఘాల ఓట్లు అడిగిన నోళ్లే.. అధికారం వచ్చాక కులం ఎందుకురా? అని ఆ నోళ్లతోనే దెప్పి పొడుస్తారు. గెలిచాక కుల సంఘాల మీటింగులకు రమ్మంటే ముఖం చాటేస్తారు. పైగా, మన కులపోడు ఒక్కడు ఓటేస్తేనే గెలిచానా..? అన్ని కులాలను తనను ఆదరించాయని సూక్తులు వల్లించే మహానట నాయకులు.. బీసీ రాజకీయ నాయకులు. మరి ఆ నాయకులకు అన్యాయం జరిగితే ఎందుకు తోడుండాలన్నది తోటి బీసీ బిడ్డ వాదన. బీసీల కోసం ఏం చేశారు? అన్న ప్రశ్నే వస్తుంది మరి.

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.